www.bharathasakthi.com

# భారత్ శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 22 | హైదరాబాద్ | శుక్రవారం,జూన్ 26 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

### భారత్‌పై తన అభిమానాన్ని చాటుకున్న

## ఇటలీ ప్రధాని మెలోని



ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి భారత్‌పై ఉన్న ప్రత్యేక అభిమానం మరోసారి అంతర్జాతీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రధాని మోదీ ఆమెకు 'మెలోడీ' చాక్లెట్లు కానుకగా ఇచ్చిన విజువల్స్ ఆల్రెడీ సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా... తాజాగా ఆమె రాసిన సరికొత్త పుస్తకం 'జార్జియాస్ విజన్'లో భారత్ పర్యటన తాలూకు ఆసక్తికరమైన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.ఢిల్లీ పర్యటనలో తనకు లభించిన గ్రాండ్ వెల్‌కమ్ గురించి రాస్తూ... రోడ్డుకు ఇరువైపులా తన భారీ

2లో..



## ఉద్యోగులకు భారీ భరోసా

- రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా
- 14 బ్యాంకులతో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూలు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపు
- ప్రమాద బీమా కవరేజీ రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లు
- విమాన ప్రమాద బీమా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు
- పీఆర్సీ హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం స్పష్టం

**హైదరాబాద్ (భారత శక్తి)** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు కూడా ఉచిత ప్రమాద బీమా సదుపాయం కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు 14 బ్యాంకులతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఎం స్వయంగా ఒప్పందాలపై సంతకాలు చేసి పథకాన్ని

2లో..

## వెనెజువెలాలో రెండు భూకంపాలు


### 164కి చేరిన మృతుల సంఖ్య..



**వెనెజువెలా:** రాజధాని కరాకస్‌తో పాటు పరిసర ప్రాంతాలలో బుధవారం సాయంత్రం వరుసగా రెండు సార్లు భూకంపాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఒక నిమిషం తేడాతో 7.2.. 7.5 మాగ్నిట్యూడ్‌తో భూకంపాలు వచ్చాయి. దీంతో పలు భవనాలు దెబ్బతినగా, మరి కొన్ని పూర్తిగా కూలిపోయాయి. ఈ ఘటనలో మృతుల సంఖ్య గురువారం మధ్యాహ్నం నాటికి 164కి చేరింది. బుధవారం రాత్రి వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ.. భూప్రకంపనల కారణంగా కారణంగా 32 మంది చనిపోయినట్లు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు.విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకుని స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించారు. గురువారం మరోసారి డెల్సీ రోడ్రిగ్జ్ భూకంపాలపై ప్రకటన చేశారు. మృతుల సంఖ్య 164కు చేరిందని తెలిపారు. 971 మంది గాయపడినట్లు వెల్లడించారు.

## పరువు నష్టం కేసు..

### - రాహుల్ గాంధీ విచారం



**న్యూఢిల్లీ (భారత శక్తి)** కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ సింగ్ చౌహాన్ తనపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీ స్పందించారు. కార్తికేయపై చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేస్తున్నానంటూ మధ్యప్రదేశ్ హైకోర్టులో మరో అప్లికేషన్ దాఖలు చేశారు. తన వ్యాఖ్యలు కార్తికేయను ఉద్దేశించినవి కావని తెలిపారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ప్రమోద్ కుమార్ అగర్వాల్ విచారణ చేపట్టనున్నారు. 2018లో జాభువాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న రాహుల్ గాంధీ పనామా పేపర్

2లో..

## 'ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు'

### ఎమర్జెన్సీ ఒక ఘోర పాపం: ప్రధాని మోదీ

- ఎమర్జెన్సీకి 51 ఏళ్లు.. కాంగ్రెస్‌పై ప్రధాని విమర్శలు
- భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం అని వ్యాఖ్య
- ఎమర్జెన్సీ విధించిన వారిని ఎప్పటికీ క్షమించవద్దని ప్రజలకు పిలుపు
- ఆనాడు ప్రతిపక్ష నేతలను జైల్లో పెట్టారని, మీడియా గొంతు నొక్కారని ఆరోపణ
- ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తాను కూడా పోరాడానని గుర్తు చేసుకున్న మోదీ

**న్యూఢిల్లీ (భారత శక్తి)** దేశంలో ఎమర్జెన్సీ విధించి 51 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఇది అత్యంత చీకటి అధ్యాయమని, కాంగ్రెస్ చేసిన ఘోరమైన పాపమని అభివర్ణించారు. ఎమర్జెన్సీని విధించిన వారిని దేశ ప్రజలు 'ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు' అని ఆయన పిలుపునిచ్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రధాని మోదీ ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'ఎమర్జెన్సీ 51వ వార్షికోత్సవం – భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎంతటి చీకటి అధ్యాయమో తెలుసుకోండి' అనే శీర్షికతో ఆనాటి పరిస్థితులను వివరించారు. "ఎమర్జెన్సీ కాలంలో పౌరుల హక్కులను, మీడియా స్వేచ్ఛను దారుణంగా అణచివేశారు. ప్రతిపక్ష నాయకులందరినీ అరెస్టు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన వారిని, రాజకీయ



2లో..

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు..

### - మరోసారి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్ (భారత శక్తి):** పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్




2లో..



## నీటిని పొదుపుగా వాడదాం

### మూడు రాష్ట్రాల సీఎంల భేటీ చరిత్రాత్మకం: సీఎం చంద్రబాబు

- తుంగభద్ర డ్యామ్‌కు 33 కొత్త క్రస్ట్ గేట్ల ఏర్పాటు
- ఒకే వేదికపై ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు
- నదుల అనుసంధానమే దేశాభివృద్ధికి కీలకమన్న చంద్రబాబు
- ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని సూచన
- దక్షిణాది రాష్ట్రాల భేటీ చరిత్రలో నిలిచిపోతుందన్న సీఎం

**హైదరాబాద్ (భారత శక్తి)** కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర ప్రాజెక్టుకు 33 నూతన క్రస్ట్ గేట్లను ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఈ కార్యక్రమం అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చొరవతో ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు ఒకేచోట కలవడం చారిత్రాత్మకమని అన్నారు. కేంద్రమంత్రి తన చొరవతో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలనే కాకుండా, నదులను కూడా అనుసంధానించారని ఆయన వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల రైతులకు సాగునీటిని, ఈ ప్రాంత వాసులకు తాగునీటిని అందిస్తోన్న తుంగభద్ర డ్యామ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. 'తుంగా పానం, గంగా స్నానం' అనే సామెతను ప్రస్తావిస్తూ, తుంగ నది నీటి పవిత్రతను కొనియాడారు. 2024లో 19వ నంబర్ గేటు కొట్టుకుపోయినప్పుడు, నిపుణుడు కన్నయ్య నాయుడు సలహాతో స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీటి వృధాను అరికట్టామని తెలిపారు. ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు సమష్టిగా పనిచేసి 33 కొత్త గేట్లను ఏర్పాటు చేసి, డ్యామ్‌ను పునరుద్ధరించి రైతుల ప్రయోజనాలను కాపాడామని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 'వన్ నేషన్ వన్ గ్రిడ్', టెలికాం, రహదారుల నెట్‌వర్క్ వంటి కార్యక్రమాలతో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు అన్నారు. ఇదే స్ఫూర్తితో దేశంలో గంగా-కావేరి నదుల్ని అనుసంధానిస్తే భారతదేశం అప్రతిహతంగా ముందుకు సాగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో కెన్-బెత్వా ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం విజయవంత మైందని గుర్తుచేశారు. అదేవిధంగా గోదావరి-కావేరి నదులను అనుసంధానించడం

2లో..

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే: కేటీఆర్

- రూ.కోటి విలువ భూములు ఇప్పుడు రూ.60 లక్షలకు కూడా అమ్ముడవడం లేదని వ్యాఖ్య
- కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ
- రైతు బంధు, దళిత బంధు అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శ
- 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కార్యకర్తలకు పిలుపు

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్‌పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో



2లో..

## రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళుతోంది: జగన్

- డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్న జగన్
- వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపాటు
- 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని విమర్శ

**అమరావతి (భారత శక్తి)** ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన కీలక హామీలను చంద్రబాబు సర్కార్ పూర్తిగా విస్మరించిందని, వడ్డీ రాయితీ పథకాన్ని నిలిపివేసి మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తోందంటూ ఎక్స్ వేదికగా ఆయన సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. ఏపీలో పన్ను ఆదాయ వృద్ధి పడిపోయిందని, రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళ్తోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలపై వడ్డీ రాయితీ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని సూపర్ సిక్స్ తరహాలో హామీ ఇచ్చిందని జగన్ అన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పారని మండిపడ్డారు. తమ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.4,969 కోట్ల మేర వడ్డీ



2లో..

# నీటిని పొదుపుగా వాడదాం



ద్వారా కర్ణాటక, ఏపీ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ప్రయోజనాలు నెరవేరతాయని సూచించారు. ఈ ఏడాది ఎల్ నినో కారణంగా తుంగభద్ర, ఆల్మట్టి జలాశయాలకు ఎగువ నుంచి నీటి ప్రవాహాలు తగ్గిపోయాయని, అందుకే నీటిని చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకే నదుల అనుసంధానం కీలకమని ఆయన పునరుద్ఘాటించారు. ముందుగా రాష్ట్రాల పరిధిలో అంతర్గతంగా నదులను అనుసంధానించుకుని, ఆ తర్వాత అంతర్రాష్ట్ర నదుల అనుసంధానంపై దృష్టి పెట్టాలని సూచించారు.విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి తుంగభద్ర నది సహజ రక్షణ కవచంగా నిలిచిందని, జోగులాంబ, హంపీ విరుపాక్ష ఆలయం, రాఘవేంద్ర మఠం వంటి ఎన్నో పుణ్యక్షేత్రాలు ఈ నదీ తీరానే వెలిశాయని చంద్రబాబు గుర్తుచేశారు. 'రాష్ట్రాలుగా మనం వేరైనా, దేశంగా మనం అంతా ఒక్కటే' అని పేర్కొంటూ, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి రైతుల ప్రయోజనాలపై చర్చించడం శుభపరిణామమని అన్నారు. ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, అందరం కలిసికట్టుగా రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

## సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ.



**హోళగుంద** మండల పరిధిలోని చిన్నహ్యాట,సులువాయి గ్రామాలోని రైతు సేవా కేంద్రాల యందు కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి,ఆలూరు ఏడిఏ చెంగల్ రాయుడు,మండల వ్యవసాయాధికారి ఆనంద్ లోకదళ్ ఆధ్వర్యంలో గురువారం రైతులకు వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి మాట్లాడుతూ టీసీజీఎస్ - 1694 రకం వేరుశెనగ విత్తనాలను కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి మరియు శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఎఫ్.పి.ఓ ఎంఏసిఎస్ లిమిటెడ్ మద్దికెర వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతులకు కొత్త వేరుశనగ వంగడాలను సబ్సిడీ పో ను రూ 6120అందిస్తూ ప్రోత్సహించడం జరుగుతుందన్నారు.కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ విరుపాక్షి అగ్రికల్చర్ అసిస్టెంట్లు రైతులు పాల్గొన్నారు

## సర్వే ఎలా చేయాలి, స్కాన్ ఎలా చేయాలో స్వయంగా నేర్పించిన జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్** ఆసిఫాబాద్ సర్ సవరణ సర్వే పనుల్లో అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను స్వయంగా పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ కె.హరిత గురువారం ఫీల్డ్‌లోకి దిగారు.జిల్లా కేంద్రంలో సర్ సవరణ సర్వేను ప్రారంభించిన కలెక్టర్ హరిత, సర్వేను ఏ విధంగా చేయాలో, లబ్ధిదారుల వివరాలు ఎలా నమోదు చేయాలో, ఆధార్-రేషన్ కార్డులను మొబైల్ ద్వారా స్కాన్ చేసి అప్‌లోడ్ ఎలా చేయాలో సిబ్బందికి స్వయంగా ప్రాక్టికల్‌గా నేర్పించారు."సర్వే అంటే గుడ్డిగా ఎంట్రీలు కొట్టడం కాదు. ఒక్కొక్క కుటుంబం వెనుక వారి జీవితం ఉంటుంది. డాక్యుమెంట్ స్కాన్ స్పష్టంగా లేకపోతే, వివరాలు తప్పుగా పడితే అర్హుడికి అన్యాయం జరుగుతుంది. అందుకే చిన్న తప్పు కూడా జరగకూడదు" అని కలెక్టర్ సిబ్బందికి సూచించారు.ట్యాబ్/మొబైల్ యాప్‌లో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను అక్కడికక్కడే సరిచేసి, సిబ్బందిలో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సర్వేలో నిర్లక్ష్యం వహించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే చేరాలంటే సవరణ సర్వే పారదర్శకంగా, లోపాలు లేకుండా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## తుంగభద్ర ప్రాజెక్టు గేట్లను ప్రారంభించిన కేంద్రమంత్రి పాటిల్

**బెంగళూరు** కర్ణాటకలోని హోస్పేట వద్ద ప్రతిష్టాత్మక తుంగభద్ర ప్రాజెక్టుకు నూతనంగా ఏర్పాటు చేసిన 33 క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో ఘనంగా జరిగింది. ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం 33 క్రస్ట్ గేట్లను కొత్తగా ఏర్పాటు చేయగా, మీట నొక్కి 17వ గేటును సీఆర్ పాటిల్ ప్రారంభించారు. 18వ గేటును కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ , 19వ గేటును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, 20వ గేటును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.2024 ఆగస్టులో సంభవించిన వరదల కారణంగా 19వ గేటు దెబ్బతినడంతో, నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు రూ.51 కోట్ల వ్యయంతో మొత్తం 33 కొత్త గేట్లను ఏర్పాటు చేశారు. తుంగభద్ర జలాల సమర్థ నిర్వహణ, సాగు మరియు తాగునీటి అవసరాల భద్రతను మరింత బలోపేతం చేయడంలో ఈ గేట్ల పునరుద్ధరణ కీలక మైలురాయిగా నిలవనుంది.

## ఎల్లార్తి దర్గలో ప్రత్యేక ఫాతెహాల్.

**హోళగుంద** మండల పరిధిలో గురువారం సందర్భంగా రాష్ట్రానికి ప్రసిద్ధి గాంచిన శ్రీ శ్రీ హాజరత్ శేక్షవలి,షాషావలి తాత దర్గాలో భక్తులు ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించారు.అలాగే భక్తులు మన రాష్ట్రం నుంచి కాక కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి తాతకు ప్రత్యేక ఫాతెహాల్ నిర్వహించి అనంతరం పార్థనలు చేసి తమ మొక్కు బడులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు దర్గా నిర్వాహకులు మల్లికార్జున అన్నదనం నిర్వహించారు

### సరూర్ సర్కిల్ పరిధిలో సర్ పై బూత్ లెవల్ ఏజెంట్లకు
## శిక్షణ కార్యక్రమం విజయవంత



ఎల్బీనగర్, జూన్ 25 (భారత శక్తి): సరూర్ నగర్ సర్కిల్ నెం.12 పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు (బిఎల్ఏ) ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం గురువారం సరూర్ నగర్ సర్కిల్ చైతన్యపురి డివిజన్ మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్‌లో విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి సరూర్ నగర్ సర్కిల్ నెం.12 డిప్యూటీ కమిషనర్, ఏఈఆర్ఓ శ్రీకాంత్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ ఏజెంట్లకు సర్ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, బూత్ స్థాయిలో బిఎల్ఏలు నిర్వహించవలసిన బాధ్యతలు మరియు ఎన్నికల సంఘం మార్గదర్శకాల గురించి వివరంగా అవగాహన కల్పించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు, ఎన్నికల విభాగం సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 19 వేల పోలీసు పోస్టులు భర్తీ చేయాలి

- జీవో 46ను రద్దు చేయాల్సిందే
- బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



ఎల్బీనగర్, జూన్ 25 (భారత శక్తి): దిల్ సుఖ్ నగర్ లో నిరుద్యోగులతో బీజేపీ ఎమ్మెల్యే స్థానిక నాయకులు సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీవో 46 వల్ల పోలీసు నియామకాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం 5 వేల పోస్టులతో సరి పెట్టకుండా 19 వేల పోలీసు ఉద్యోగాలను భర్తీ చేయాలని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 15 లక్షల



మంది పోలీసు అభ్యర్థులు, 30 లక్షల మంది నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. నిరుద్యోగ సమస్యపై డిక్లరేషన్? ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని పోస్టులు భర్తీ చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీజీపీ 19 వేల పోలీసు పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెబుతుంటే ప్రభుత్వం మాత్రం 5 వేల పోస్టుల గురించే మాట్లాడుతుందని ఆయన విమర్శించారు. అభ్యర్థులకు 35 ఏళ్ల వరకు వయోపరిమితి సడలింపు ఇవ్వడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఒకే కటాఫ్ అమలు చేయాలని, తెలంగాణ యువతను నాన్-లోకల్‌గా పరిగణించే పరిస్థితి ఎలా వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. జీవో 46ను సవరిస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయకపోవడాన్ని తప్పు బట్టారు. నిరుద్యోగుల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతామని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి వెనుకాడబోమని మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. నిరుద్యోగులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్?, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, అనితా రెడ్డి, భూక్యా కుమార్, ఆకాశ్?, సంధ్య, నవీన్ పట్నాయక్, శింబు నాయక్, నవీన్ గౌడ్, ప్రత్యూష తదితర నిరుద్యోగులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు భారీ భరోసా

ప్రారంభించారు.ఁఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ప్రభుత్వం కోసం కష్టపడే ఉద్యోగుల భద్రతను కాపాడటం తమ బాధ్యత అని చెప్పారు. ఉద్యోగులు అడగక ముందే ప్రభుత్వం ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పదవీ విరమణ తర్వాత కూడా బీమా ప్రయోజనాలు కొనసాగించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రమాద బీమా కింద ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు కవరేజీ లభిస్తుందని తెలిపారు. విమాన ప్రమాదాల సందర్భంలో బ్యాంకులు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బీమా రక్షణ అందిస్తాయని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ స్పష్టం చేశారు. పీఆర్సీ విషయంలో ఇచ్చిన హామీని కూడా తప్పకుండా అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల నమ్మకమే ప్రభుత్వానికి బలమని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగ వ్యవస్థ శాశ్వతమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉండేదని విమర్శించిన సీఎం విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి నెలా తొలి రోజే జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయం పెరిగేలా ఉద్యోగులు ప్రతిరోజూ అదనంగా గంట పనిచేయాలని కోరారు. వచ్చే అదనపు ఆదాయాన్ని ఉద్యోగుల సంక్షేమానికే వినియోగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజకీయ అంశాలపైనా స్పందించిన సీఎం తాను "గుంపు మేస్త్రీ"నని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే తన బృందానికి నాయకత్వం వహిస్తున్నానని అన్నారు. మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు..

ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేసు విచారణను వాయిదా వేస్తూ తదుపరి విచారణను జూలై 22కు నిర్ణయించింది.

## రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళుతోంది: జగన్

రాయితీతో పాటు ఆసరా, చేయూత వంటి స్కీమ్స్‌తో ఆర్థిక భరోసా ఇచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని జగన్ ఆరోపించారు. 2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లు, మళ్లీ ఇప్పుడు 2026-27 బడ్జెట్‌లోనూ రూ.100 కోట్లు కేటాయించినప్పటికీ.. ఆ నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, గ్రౌండ్ లెవెల్లో ఒక్క పైసా కూడా విడుదల కాలేదన్నారు. ఈ వడ్డీ రాయితీ అమలు చేయకపోవడం వల్ల గత రెండేళ్లలో డ్వాక్రా మహిళలకు సుమారు రూ.6 వేల కోట్ల మేర నష్టం జరిగిందని విమర్శించారు. 2023-24లో రూ.49,696 కోట్లుగా ఉన్న డ్వాక్రా రుణ వృద్ధి.. కూటమి పాలనలో 2024-25 నాటికి రూ.41,623 కోట్లకు, 2025-26లో మరింత తగ్గి రూ.41,105 కోట్లకు పడిపోయిందని అన్నారు. అంతేకాదు, 2025-26లో రాష్ట్ర పన్ను ఆదాయ వృద్ధి -3.22 శాతంగా నమోదైందని... ఇది ఏపీలో స్పష్టమైన ఆర్థిక మాంద్యానికి సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న మహిళా సంఘాలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం మరింత సంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తూ, బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే: కేటీఆర్

చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## 'ఎప్పటికీ క్షమించవద్దు.. ఎప్పటికీ మర్చిపోవద్దు'

అసమ్మతి తెలిపిన వారిని తీవ్రంగా అణచివేశారు. రచయితలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులతో పాటు సామాన్య పౌరులను కూడా జైళ్లలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు" అని మోదీ ఆరోపించారు. ఆనాడు రాజ్యాంగాన్ని కాలరాశారని, న్యాయవ్యవస్థను రాజకీయ నియంత్రణలోకి తెచ్చేందుకు నీచమైన ప్రయత్నాలు జరిగాయని మోదీ విమర్శించారు. "మీడియాపై తీవ్రమైన ఆంక్షలు విధించారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని వారిని బెదిరించారు లేదా పత్రికలను మూసివేశారు. ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేశారు. పౌరులను రక్షించాల్సిన ప్రతి వ్యవస్థ వారికే వ్యతిరేకంగా మారింది. పార్లమెంటును కేవలం ఒక 'రబ్బరు స్టాంపు'గా మార్చేశారు" అని ఆయన పేర్కొన్నారు. అంతటి నిర్బంధం మధ్య కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందరో పోరాడారని మోదీ గుర్తుచేశారు. "వివిధ నేపథ్యాలు, సిద్ధాంతాలకు చెందిన ప్రజలందరూ ఏకమై ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ముందుకు వచ్చారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిగిన ఆ ఉద్యమంలో పాలుపంచుకునే గౌరవం నాకు కూడా దక్కింది" అని ఆయన తెలిపారు. ప్రజల పోరాట స్ఫూర్తి (జనశక్తి) ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పలేదని, చివరికి ఎమర్జెన్సీని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించగా, దానిని విధించిన వారు ఘోరంగా ఓడిపోయారని వివరించారు. "ఎమర్జెన్సీ అనే ఘోర పాపం దానిని విధించిన వారి నుదుట శాశ్వతంగా నిలిచిపోతుంది. ఆనాడు ప్రజాస్వామ్యం కోసం దృఢంగా నిలబడిన ప్రతి ఒక్కరికీ ఈరోజు మనం వందనం చేస్తున్నాం. వారి వల్లే ప్రజాస్వామ్యం బతికింది" అని మోదీ పేర్కొన్నారు.

# పరువు నష్టం కేసు..

లిక్స్ అంశాన్ని ప్రస్తావించారు. ఆ సందర్భంగా రాహుల్ గాంధీ కార్తికేయ సింగ్ ప్రస్తావన కూడా తేవడంతో ఆయన భోపాల్‌లో ఎమ్మెల్యే-ఎంపీ స్పెషల్ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల వల్ల తన పరువు దెబ్బతిందని ఆరోపించారు. దీంతో, విచారణకు హాజరు కావాలంటూ ట్రయల్ కోర్టు రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది.

అయితే, రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లతో పాటు తనపై దాఖలైన పరువు నష్టం కేసును కొట్టేయాలని అభ్యర్థించారు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తూ తాజాగా మరో అప్లికేషన్ దాఖలు చేశారు.కాగా, రాహుల్ గాంధీ తాజా పిటిషన్‌పై బీజేపీ ఐటీ సెల్ విమర్శలు వ్యక్తం చేసింది. రాహుల్ గాంధీ ఇప్పటికి ఎన్నో సార్లు ఇలాంటి క్షమాపణలు చెప్పారని కామెంట్ చేసింది. రాహుల్ గాంధీ అసలు కార్తికేయ పేరును ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందని ప్రశ్నించింది. ఆధారాలు లేకుండా ఇలాంటి కామెంట్స్ చేస్తే రాహుల్ విశ్వసనీయతపై సందేహాలు తలెత్తుతాయని విమర్శించింది.

## భారత్‌పై తన అభిమానాన్ని చాటుకున్న
# ఇటలీ ప్రధాని మెలోని

పోస్టర్లను చూసి మురిసిపోయానని మెలోని పేర్కొన్నారు. ఆ సమయంలో తన పక్కనే ఉన్న ఇటలీ ఉప ప్రధాని ఆంటోనియో తజని.. "ఈ క్రేజ్ చూస్తుంటే మీరు గనుక ఢిల్లీ నియోజకవర్గం నుండి ఎన్నికల్లో పోటీ చేస్తే కనీసం 10 లక్షల మెజారిటీతో గెలుస్తారు" అంటూ సరదాగా చమత్కరించిన విషయాన్ని వెల్లడించారు.

2023లో రైసినా డైలాగ్, జీ20 సదస్సుల కోసం రెండుసార్లు భారత్‌లో పర్యటించిన మెలోని.. "అడుగడుగునా నా ఫొటోలతో స్వాగతం పలికిన భారత్‌కు థాంక్స్" అంటూ మన దేశంపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

# సంపాదకీయం

భారత శక్తి VOICE OF INDIAN

## చమురు ధరలు 50 డాలర్ల దిగువకు..?

సుదీర్ఘ కాలంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఇటీవల అమెరికా- ఇరాన్ ఎట్టకేలకు తాత్కాలిక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేయగా కాస్త ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. దీంతో అప్పటినుంచి ముడి చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. గరిష్ఠ స్థాయిల నుంచి పెద్ద మొత్తంలో పతనమై ప్రస్తుతం 4 నెలల కనిష్ఠ స్థాయిలకు చేరడం ఊరట కలిగిస్తోంది. జూన్ 24న బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 75.45 డాలర్లకు పడిపోయింది. ఇవాళ ఒక్కరోజే 2 శాతానికిపైగా తగ్గింది. భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభం కాగా అప్పుడు 70 డాలర్ల స్థాయిలో ఉన్న క్రూడాయిల్ ధర భారీగా పెరుగుతూ వెళ్లింది. ఈ క్రమంలోనే ఒక దశలో ఏకంగా 126 డాలర్ల స్థాయికి ఎగబాకింది. దాదాపు 70 శాతానికిపైగా పెరిగిందని చెప్పొచ్చు. ప్రధానంగా చమురు రవాణాకు కీలకంగా ఉన్న హోర్ముజ్ జలసంధి మూతబడటంతో ఈ క్రమంలోనే పలు దేశాల్లో చమురు సంక్షోభం నెలకొంది. పలు దేశాల్లో ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయి. తర్వాత మొదట కాల్పుల విరమణ, తర్వాత ఒప్పందం దిశగా అడుగులు పడటంతో చమురు ధర తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు డీల్ కుదిరిన తర్వాత మరింత తగ్గుతూ వస్తోంది.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రతి బారెల్‌కు 78 డాలర్లకు పడిపోయి.. గత మూడు నెలల కనిష్ట స్థాయిని తాకినా భారత ప్రభుత్వం ధరలు తగ్గించకపోవడంపై సామాజిక మాధ్యమ వేదిక 'రెడ్డిట్ లోని ఇండియన్ స్టాక్ మార్కెట్ ఫోరమ్‌లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. అంతర్జాతీయంగా ధరలు తగ్గినా భారత్‌లో ఇంధన ధరలను తగ్గించకపోవడంపై నెటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో చమురు ధరలు తగ్గకపోతే ద్రవ్యోల్బణం పెరిగి.. ఆర్థిక వృద్ధి మందగిస్తుందని... ప్రభుత్వం సామాన్యుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని కొందరు నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ డిబేట్‌లో వినియోగదారులపై పడుతున్న పన్నుల భారం ప్రధానంగా చర్చకు వచ్చింది. ముడిచమురు ధరలు పెరిగినప్పుడు లీటరుకు ఎనిమిది రూపాయల వరకు పెంచిన ప్రభుత్వం... ధరలు తగ్గినప్పుడు మాత్రం ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేయడం లేదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాల కోసం మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులను ప్రభుత్వం ఏటికేడు పిండేస్తోందని.. 2014 నాటి యూపీఏ ప్రభుత్వ కాలం నాటి వ్యతిరేక పరిస్థితులే ప్రస్తుత ప్రభుత్వంపై కూడా కనిపిస్తున్నాయని కొందరు కామెంట్ చేశారు.మరోవైపు.. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ ధరలకు, దేశాలు కొనుగోలు చేసే భౌతిక మార్కెట్ ధరలకు మధ్య వ్యత్యాసం ఉంటుందని కొందరు ఆర్థిక కోణాన్ని విశ్లేషించారు. 2026 మార్చిలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా 100 నుండి 110 డాలర్లకు పెరిగినప్పుడు... ఆ భారాన్ని ప్రభుత్వం వినియోగదారులపై పడకుండా కొంతకాలం నియంత్రించిందని ఒక నెటిజన్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఇంధన ధరల స్థిరత్వాన్ని కాపాడటం వల్లే భారీ యుద్ధ సమయాల్లో కూడా దేశంలో ధరలు అదుపులో ఉన్నాయని, తక్షణమే ప్రయోజనాలు ఆశించడం సరికాదనే వాదన కూడా వినిపించింది. ఇంధన ధరల నియంత్రణకు గానూ ప్రభుత్వం చేపడుతున్న ఇథనాల్ బ్లెండింగ్ విధానంపైనా రెడ్డిట్ వినియోగదారులు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చమురు ధరలు ఎంత తగ్గినా.. పెట్రోల్, డీజిల్ పరిమాణాన్ని తగ్గించి దాని స్థానంలో ఇథనాల్‌ను ఎక్కువగా కలుపుతున్నారని నెటిజన్లు ఆరోపించారు. దీనివల్ల సామాన్యుడికి ధరల భారం తగ్గడం లేదని... కేవలం ఇథనాల్ తయారుచేసే బడా వ్యాపారవేత్తలకు, పాలకుల కుటుంబాలకే లాభం చేకూరుతోందంటూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఉద్దేశించి కొందరు ఘాటుగా విమర్శలు గుప్పించారు.. ఈ ఇంధన సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా ఈవీ అడాప్టేషన్ వైపు మారడమే ఏకైక మార్గమని కొందరు అభిప్రాయపడగా... అది అంత సులువు కాదని మరికొందరు గణాంకాలతో వివరించారు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న 5 కోట్ల కార్లు, 26 కోట్ల ద్విచక్ర వాహనాలను ఈవీలుగా మార్చాలంటే దేశ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని మరో 600 నుండి 700 శాతం పెంచాల్సి ఉంటుందని... లేదంటే గ్రిడ్ వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏదేమైనా.. అంతర్జాతీయంగా తగ్గిన చమురు ధరల ప్రయోజనం దేశీయంగా సామాన్యుడికి అందడం లేదనేది ఈ మొత్తం చర్చ సారాంశం.ముడి చమురు ధర సమీప భవిష్యత్తులో మరింత తగ్గుతుందని భావిస్తుండగా, ఇది భారత్‌పై దిగుమతుల భారం తగ్గేలా చేస్తుంది. ధరలు నిరంతరాయంగా తగ్గుతుండటంతో, క్రూడాయిల్ బ్యారెల్‌కు 50 డాలర్ల కంటే కిందికి పడిపోతుందా అనే చర్చ తెరపైకి వచ్చింది. అయితే, సమీప భవిష్యత్తులో ధరలు అంతగా పడిపోయే అవకాశం లేదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతానికి మార్కెట్ కేవలం భౌగోళిక రాజకీయాల నుంచి డిమాండ్-సప్లై సమీకరణాల వైపు మళ్లుతోంది. బ్రెంట్ క్రూడ్ రాబోయే రోజుల్లో 65 నుంచి 75 డాలర్ల పరిధిలో కదలాడవచ్చు. ధరలు 50 డాలర్ల దిగువకు వెళ్లాలంటే చైనా లాంటి పెద్ద దేశాల్లో డిమాండ్ దారుణంగా పడిపోవాలి, లేదా అంతర్జాతీయంగా చమురు నిల్వలు విపరీతంగా పేరుకుపోవాలి. ప్రస్తుతానికైతే అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.ఈ క్రమంలోనే రూపాయి విలువ పుంజుకోవడం సహా ద్రవ్యోల్బణం భయాలు కూడా తగ్గుముఖం పడతాయి. యుద్ధం ప్రారంభం నాటి నుంచి గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న చమురు నౌకలు/ట్యాంకర్లు ఇప్పుడు హోర్ముజ్ జలసంధిగుండా రాకపోకలు ప్రారంభించాయి. ఇది మరింత సానుకూల పరిణామాల్ని తీసుకొచ్చింది. మరోవైపు ఇరాన్‌పై ఇన్ని రోజులు ఉన్న ఆంక్షల్ని కూడా అమెరికా సడలించింది. ఇరాన్ చమురు క్రయవిక్రయాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో మార్కెట్లో చమురు లభ్యత పెరిగి ధర తగ్గుతోంది.

అయినప్పటికీ సామాన్య వినియోగదారులకు వెంటనే ఊరట కలగకపోవచ్చని భావిస్తున్నారు. క్రూడాయిల్ ధరలు తగ్గినా దేశీయంగా చమురు సంస్థలు పెట్రోల్, డీజిల్ రేట్లను ఇప్పట్లో తగ్గించే అవకాశాలు ఉండవని నిపుణులు పేర్కొంటున్నారు.ఇటీవల యుద్ధం సమయంలో మే నెలలో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధర లీటరుకు సగటున రూ. 7.50 వరకు పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 115.73 గా ఉండగా, డీజిల్ లీటరుకు రూ. 103.82 గా ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో హైదరాబాద్‌లోనే ఇంధన ధరలు అధికంగా ఉన్నాయి.

# కొండపైన దుకాణాలు రద్దు చేయాలని కోరుతూ గిరి ప్రదక్షిణ

భారత శక్తి, జూన్ 25 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన కొండపైన గత కొన్నేళ్లుగా వర్తక సంఘం పేరుతో అతి తక్కువ కిరాయితో దుకాణాలను నడుపుతూ దేవస్థానాన్ని, భక్తులను నిలువునా ముంచుతున్నారని కావున వర్తకసంఘం రద్దు చేసి టెండర్లు నిరదవహించాలని కోరుతూ యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కొండ చుట్టూ గిరి ప్రదక్షణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని అధికారుల మరియు రాజకీయ నాయకుల పైరవీలతో పునరుద్ధరించుకుంటూ కొత్తవారికి టెండర్లు వేసే అవకాశం ఇవ్వకుండా చేస్తున్న వర్తక సంఘాన్ని తక్షణమే రద్దు చేసి టెండర్లు వేయాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. గతంలో కేవలం 30,40 షాపులే ఉండేవని ఇప్పుడు వాటిని 114 షాపులుగా పెంచారని తెలిపారు. రాజకీయ, అధికార బలం తోటి ఇష్టం వచ్చిన విధంగా ఈ షాపులను కేటాయిస్తున్నారని, స్వామివారి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా వీళ్లు ఎటువంటి ఆస్తులు, భూములు కోల్పోలేదని పేర్కొన్నారు. స్వామి వారి కోసం ఎంతోమంది వారి ఇండ్లను భూములను కోల్పోయినా వారికి ఎటువంటి న్యాయం జరగలేదని తెలిపారు. ఇట్టి వర్తక సంఘం వల్ల దేవస్థానానికి మరియు భక్తులకు నష్టమే తప్ప లాభం లేదని కావున తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని కోరడం జరిగింది. గత నెల 31వ తేదీ వరకే వారి దుకాణాల గడువు ముగిసినా ఒక నెల వారికి మళ్ళీ అవకాశం ఇవ్వడాన్ని భక్తులందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇదే విధంగా కొనసాగించడం వల్ల దేవస్థాన ఆదాయానికి గండి పడుతుందని వాటిని కచ్చితంగా టెండర్లు వేయాలని కోరడం జరిగింది. లేకపోతే టెండర్లు రద్దు చేసే వరకూ పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండ రామస్వామి, ఆరె స్వామి, గ్యాదపాక బాలనర్సయ్య, పసుపునుటి మురళి, మాటూరి బాలయ్య, బండి అనిల్, బుగ్గ ఆంజనేయులు, గౌడ శ్రీశైలం, కర్రె ప్రవీణ్, కొన్నె సంజీవ, దొమ్మాట ప్రభాకర్, పల్లపు రవి, గుండు కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# నియోజకవర్గ అభివృద్దే సంకల్పంగా పని చేస్తున్న..

**-పని చేసే వారిని, చేయని వారిని ఒకే రకంగా చూడవద్దు.**

**-గత 15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎం చేశాడో ఒకసారి ఆలోచించాలి.**

**-ఏనాడూ నియోజకవర్గ అభివృద్ధిని, గ్రామాల అవసరాలను పట్టించుకోలేదు.**

**-బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న పెద్దలు దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదు.**

**-మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామ ప్రజలకు హామీ**



జనగామ (భారత శక్తి) జూన్ 25: రఘునాథపల్లి మండలం గబ్బేట గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ





సందర్భంగా గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లను గ్రామస్తులు, లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.

### ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ

గబ్బేట గ్రామంలో 20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, 10లక్షల రూపాయల సిసి రోడ్లు, ఎస్సి కాలనిలో 20లక్షల సిసి రోడ్లు, ఈజీఎస్ నిధుల ద్వారా 15లక్షల సిసి రోడ్లు మంజూరు చేసి పనులు పూర్తి చేసుకొని ప్రారంభించుకున్నామని తెలిపారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం పూర్తి చేయడానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేస్తానని నెల రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక సర్పంచ్ ను ఆదేశించారు. ఇప్పటికే గబ్బేట గ్రామంలో 18ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని అందులో ఈ రోజు 4ఇళ్లను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను చూస్తుంటే కడుపు నిండినట్లు అనిపిస్తుందని వెల్లడించారు. అలాగే కోమటిగూడెం రోడ్డును త్వరలోనే మంజూరు చేస్తానని, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ పూర్తి చేయడానికి మరో 5లక్షలు వెంటనే మంజూరు చేస్తానని, మహిళా సమాఖ్య భవనం కూడా త్వరలోనే మంజూరు చేస్తానని తెలిపారు. నెల రోజులలోపు మరో 25లక్షల సిసి రోడ్లు మంజూరు చేస్తానని అన్నారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈ రెండున్నర ఏళ్లలో గబ్బేట గ్రామంలో కోటి 50లక్షలతో పలు అభివృద్ధి పనులు చేసుకున్నామని వెల్లడించారు. వచ్చే ఏడాదిలోపు గబ్బేట గ్రామ అభివృద్ధికి మరో కోటి రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో గత 15ఏళ్ళు ఎమ్మెల్యే గా ఉన్న వ్యక్తి ఎం చేశాడో ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఏనాడూ అభివృద్ధిని పట్టించుకోలేదని, దళిత బంధు పథకాన్ని కూడా అమ్ముకున్న వ్యక్తి గత ఎమ్మెల్యే అని ఆరోపించారు. 10ఏళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న పెద్దలు దోచుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదని అన్నారు. కడియం శ్రీహరి ఏనాడూ అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. పని చేయని వారిని, పని చేసే వారిని ఒకే రకంగా చూడవద్దని ప్రజలను కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలనే ఏకైక సంకల్పంతో పని చేస్తున్నాన్ని పేర్కొన్నారు. పేద ప్రజల స్వంత ఇంటి కళను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాకారం చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే 6గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, సన్నాలకు బోనస్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూటికంటి ఉపేంద్ర అనిల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లు

**-ఆగస్టు నాటికి టన్నెల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి**



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 25 (భారతశక్తి): ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లు అంకిత్, దివాకర టి.ఎస్. గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద కొనసాగుతున్న టన్నెల్ నిర్మాణ పనులను సంయుక్తంగా పరిశీలించారు. టన్నెల్ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, భద్రతా ప్రమాణాల అమలు, నిర్మాణ ప్రక్రియ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల స్థలాన్ని సందర్శించిన కలెక్టర్లు టన్నెల్ నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులను పరిశీలించి, చేపడుతున్న పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పనులను మరింత వేగవంతం చేసి ఆగస్టు లోపల పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజినీరింగ్ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించాలని సూచించారు. టన్నెల్ నిర్మాణ సమయంలో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పనుల ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ పనుల అమలులో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. టన్నెల్ నిర్మాణానికి సంబంధించిన భద్రతా చర్యలు, మార్జిన్ సేఫ్టీ అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణ నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్లు ఆదేశించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే విధంగా నాణ్యమైన నిర్మాణాన్ని అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఇరిగేషన్ శాఖ టన్నెల్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరిక్షిత్ మెహ్రా, చీఫ్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. కృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జూన్, జూలై నెలల్లో 'సదరం' శిబిరాలు.

### షెడ్యూల్ విడుదల చేసిన సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్.

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 25: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో రాబోయే జూన్ మరియు జూలై మాసాల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక సదరం శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల వైకల్యాలు కలిగిన బాధితులకు ఆయా విభాగాల నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి సదరం సర్టిఫికెట్లు అందజేసేందుకు తేదీలను ఖరారు చేశారు. ఈ సమాచారాన్ని మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని ప్రజలకు విస్తృతంగా చేరవేసి, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. వైద్యుల సూచనల ప్రకారం ఖరారైన క్యాంపుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జూన్ 30వ తేదీ మంగళవారం నాడు కంటిచూపు విభాగానికి సంబంధించి 30 స్లాట్లతో శిబిరం ప్రారంభమవుతుంది. జూలై 2వ తేదీ గురువారం నాడు ఆర్థో విభాగానికి 45 స్లాట్లు, వినికిడి విభాగానికి 46 స్లాట్లు కేటాయించారు. జూలై 3వ తేదీ శుక్రవారం నాడు కూడా ఆర్థో విభాగానికి 45, వినికిడి విభాగానికి 46 స్లాట్లతో శిబిరాలు జరుగుతాయి. జూలై 4వ తేదీ శనివారం నాడు ఆర్థో విభాగానికి 45, కంటిచూపు విభాగానికి 30 స్లాట్లు ఉంటాయి. జూలై 6వ తేదీ సోమవారం ఆర్థో విభాగానికి 45 స్లాట్లు, జూలై 7వ తేదీ మంగళవారం ఆర్థో విభాగానికి 45 మరియు కంటిచూపు విభాగానికి 23 స్లాట్లు కేటాయించారు. జూలై 8వ తేదీ బుధవారం ఆర్థో విభాగానికి 45 స్లాట్లు, జూలై 9వ తేదీ గురువారం జనరల్ వైకల్యాల విభాగానికి 20 స్లాట్లు సిద్ధం చేశారు. చివరిగా జూలై 17వ తేదీ శుక్రవారం మానసిక వైకల్యాల విభాగానికి 21 స్లాట్లు, జూలై 18వ తేదీ శనివారం అదే విభాగానికి 20 స్లాట్లతో ఈ శిబిరాలు ముగుస్తాయి. పైన పేర్కొన్న తేదీల్లో సదరం శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు తమ వెంట సంబంధిత మెడికల్ డాక్యుమెంట్లు, అవసరమైన ఎక్స్-రే నివేదికలు, ఖణ×ణ అప్లికేషన్ ఫారమ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో మరియు ఫోన్ నెంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అర్హులైన వారందరూ నిర్దేశిత తేదీల్లో ఉదయం 09:00 గంటలకల్లా ఆసుపత్రిలోని సదరం శిబిరానికి చేరుకుని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూపర్ ఇంటెండెంట్ స్పష్టం చేశారు.

## సోలార్ ఫెన్సింగ్ వద్ద కరెంట్ షాక్‌తో రైతు మృతి.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 25 ( భారత శక్తి )కుభీర్ మండలం, మండలంలోని సిరిపెల్లి హెచ్ గ్రామంలో గురువారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పబ్బు రాజన్న (60) అనే రైతు కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు.స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, రాజన్న తన వ్యవసాయ పొలానికి వెళ్లిన సమయంలో పొలం చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ వద్ద విద్యుత్ తీగలు తెగి కింద పడివున్నాయి. వాటిని గమనించకుండా వెళ్లిన రాజన్న ప్రమాదవశాత్తు ఆ తీగలను తాకడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.మృతుడు పబ్బు రాజన్న, తండ్రి రాజన్న, సిరిపెల్లి హెచ్ గ్రామ నివాసి కాగా, ఆయనకు కుమారుడు రాజేందర్ ఉన్నారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.రాజన్న మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్థులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్.



జనగామ(భారత శక్తి)జూన్ 25: దేవరుప్పుల మండలకేంద్రానికి చెందిన పాము యాకస్వామి-శోభారాణి దంపతుల కుమారుడు సోమశేఖర్-వైష్ణవి మృదుల వివాహ మహోత్సవం మండలకేంద్రంలోని భార్గవి గార్డెన్ లో జరిగిన వేడుకకు హాజరై నూతన వధూవరులను దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చిలుకూరి నర్సయ్య, గోడిశాల శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు తోటకూరి మహేష్, చిలుకూరి ఉమేష్, చింత ఐలయ్య, కారుపోతుల మహేందర్, ఆకుల సంతోష్, ఉప్పుల అనిల్, తోటకూరి సందీప్, పత్తేపురపు శేఖర్,దుంపల గణేష్, బబ్బురి శ్రీనాథ్, గోడిశాల ఉప్పలయ్య, కొంగ అశోక్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమాల నిర్వహణ

### పాల్గొన్న పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి.



మేడిపల్లి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25: మేడిపల్లి మరియు పీర్జాదిగూడ డివిజన్లలో ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పాల్గొని ఓటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సవరణలు చేయించుకోవాలని కోరారు.అలాగే యువత 18 సంవత్సరాలు నిండిన వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవడం అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజు, బిట్టు బి ఎల్ ఓ తన్వి, స్థానిక నాయకులు, ఎన్నికల సిబ్బంది, పలువురు ఓటర్లు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఎస్పీ రాజేష్ చంద్ర




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 25: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిపాలన, పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, జిల్లా సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి నిజాంసాగర్ చౌరస్తా వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో అధికారులు, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొని మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు.

అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తుకు మూలస్తంభమని, మాదక ద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ అభివృద్ధిని కూడా దెబ్బతీస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు.జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగుతోందని చెప్పారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసు శాఖకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాజ సహకారంతోనే మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు.కార్యక్రమం ముగింపులో మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, జిల్లా సంక్షేమ అధికారి కుమారి ఐ. ప్రసన్న, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, పోలీసు అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా

# మత్తుకు దూరం..ప్రగతికి బాటలు

### - జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా






నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 25 (భారత శక్తి )నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఉన్నత లక్ష్యాల దిశగా పయనించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పిలుపునిచ్చారు. 'మిషన్ పరివర్తన'లో భాగంగా స్థానిక దీక్ష జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కి పెహచాన్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత యాంత్రిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా యువత మత్తు పదార్థాల బారిన పడుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిస కావడం అంటే జీవితాన్ని నాశనం చేసుకోవడమేనని, దీని నుంచి బయటపడటానికి యువత దృఢ సంకల్పంతో ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు బానిస కాకుండా, విలువైన సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని, గొప్ప శాస్త్రవేత్తలు, సంఘసంస్కర్తల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకోవాలని హితవు పలికారు. పేదరికం, చదువుల ఒత్తిడి, ఇతరులతో అనవసరమైన పోలికల వల్లే మానసిక ఆందోళనకు గురై యువత తప్పుడు మార్గాల్లో పయనిస్తున్నారని కలెక్టర్ విశ్లేషించారు. వ్యతిరేక ఆలోచనలు రాకుండా, అభ్యాసంలో నిమగ్నమై ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారి సందేహాలకు సమాధానాలిచ్చారు. అనంతరం అందరితో కలిసి నషా ముక్త్ భారత్ (మత్తు రహిత భారత్) కోసం ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి పరశురాం, మానసిక

# గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ.

### - నాణ్యమైన విద్య, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి.

నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూన్ 25: (భారత శక్తి ) నిర్మల్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాల (నిర్మల్ బాలురు)ను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మందమకరందు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పాఠశాల రిజిస్టర్లతో పాటు కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులను తనిఖీ చేసిన ఆయన, వంటగది, భోజనశాల, మరుగుదొడ్ల పరిస్థితులను కూడా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని, వారి ఆరోగ్యం మరియు శారీరక అభివృద్ధికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.

అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమైన ప్రాజెక్టు అధికారి మందమకరందు, విద్య యొక్క ప్రాధాన్యతను వివరించి ప్రేరణాత్మక సూచనలు చేశారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివితే విజయం సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు.పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నీటి నిల్వల కారణంగా దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు.అదేవిధంగా వంటగది పరిసరాల్లో పోషక విలువలు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయల మొక్కలను పెంచాలని సూచించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఎటువంటి రాజీ లేకుండా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్



అంబాజీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జీఎం కార్యాలయం ఎదుట అధికారుల నిరసన




మణుగూరు, జూన్ 25 (భారతశక్తి): వేతన పెంపుదల, పెర్ఫార్మన్స్ రిలేటెడ్ పే చెల్లింపును డిమాండ్ చేస్తూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో గురువారం మణుగూరు ఏరియా అధికారులు జీఎం కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఓఏఐ సంఘం నాయకులు మాట్లాడుతూ పెండింగులో ఉన్న రెండేళ్ల పీఆర్పీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. 2017 వేతన సవరణ నష్టాన్ని సవరించి కోలిండియాలో అమలు చేస్తున్న పే అప్ గ్రేడ్ ను సింగరేణి లో కూడా అమలు చేయాలని కోరారు. న్యాయం జరిగేంత వరకు వివిధ రకాలుగా నిరసన తెలుపుతామన్నారు. సంస్థ అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోసిస్తున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కరించక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఎంఓఏఐ నాయకులు వీ.మదన్ నాయక్, ఆర్. మధుబాబు, పి.రమేష్, డా.సురేష్ ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# పవన్ కత్తి లేకుండా వచ్చే ఎన్నికల్లో యుద్ధానికి దిగుతున్నారా?

**విజయవాడ,(భారత శక్తి)** జనసేన అధినేత పవన్ కల్యాణ్ వద్ద అస్త్రాలన్నీ దాదాపుగా ఇప్పటికే వాడేశారు. వచ్చే ఎన్నికల్లో ఇక వాడేందుకు ఎలాంటి అస్త్రాలు ఆయన వద్ద లేదు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లి ఏం చెప్పగలుగుతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతం వేరు. ప్రస్తుతం వేరు. భవిష్యత్ మరొలా ఉంటుంది. గత మూడు ఎన్నికల్లో తాను అధికారంలో లేకపోవడంతో ప్రజల వద్దకు వెళ్లి చెప్పేందుకు తగిన అంశాలున్నాయి. కానీ ఈసారి మాత్రం ఆయన అన్ని ఆయుధాలను వాడేశారు. మిగిలింది తమకు మరోసారి అధికారం ఇస్తే అభివృద్ధి సంక్షేమం అందిస్తామని మాత్రమే చెప్పగలిగేందుకు అవకాశముంటుంది.. 2014లో జనసేన పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ నాడు పోటీ చేయలేదు. నాడు టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చారు. అనుభవమున్న నేతతో పాటు, నాడు మోదీ చరిష్మా పట్ల ఆకర్షితుడైన పవన్ కల్యాణ్ వారికి మద్దతు పలికారు. 2019 ఎన్నికలకు వచ్చే సరికి టీడీపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మరొక కూటమిని ఏర్పాటు చేసుకుని బీజేపీ, టీడీపీలపై విమర్శలు చేశారు. కానీ నాడు పవన్ కల్యాణ్ పోటీ చేసిన రెండు స్థానాలలోనూ ఓటమి చెందారు. జనసేన ఒకే ఒక స్థానం నుంచి గెలిచింది. 2024 ఎన్నికలకు వచ్చే సరికి చంద్రబాబు అరెస్ట్... టీడీపీ, బీజేపీతో జనసేన జట్టుకట్టడంతో కొంత ఆయుధాలు పుష్టిగా పవన్ కు లభించాయి. 2019 నుంచి వైసీపీ అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారు. 30 వేల మంది యువతులు మాయం అయ్యారని, లా అండ్ ఆర్డర్ దెబ్బతినిందని, అభివృద్ధి ఆగిపోయిందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేవంటూ జనంలోకి వెళ్లగలిగారు. తాము అధికారంలోకి వస్తే యువతతో పాటు మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని బహిరంగ సభల్లో చెప్పేందుకు వీలు కలిగింది. అయితే వచ్చే ఎన్నికల్లో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని మాత్రమే పవన్ కల్యాణ్ చెప్పగలరు. మరొక పార్టీని అధికారంలోకి రానివ్వవద్దని చెప్పడానికి పవన్ కల్యాణ్ వద్ద ఎటువంటి ఆయుధాలు లేవు. దీంతో పవన్ కల్యాణ్ ఆయుధాలు లేకుండా యుద్ధానికి దిగాల్సి వస్తుందన్న పరిస్థితి వస్తుంది. మరి వచ్చే ఎన్నికల్లో ప్రజలు, కాపు సామాజికవర్గం, అభిమానులు ఎలా రియాక్ట్ అవుతారన్నది చూడాలి.

### నేతల్లో టెన్షన్

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ చాలా మంది నేతలు సంతోషంగా లేరు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు మూడుసార్లు అధికారంలో ఉన్నప్పటి పరిస్థితికి చాలా తేడా వచ్చిందంటున్నారు. పార్టీ నాయకత్వ వైఖరి మారడమే కాకుండా, పార్టీ కేంద్ర కార్యాలయం ఇస్తున్న నివేదికలపైనే చంద్రబాబు ఎక్కువ ఆధారపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ఇచ్చే ఫీడ్ బ్యాక్ ను చూసి నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆరోపణలు సోషల్ మీడియాలోవెల్లువెత్తుతున్నాయి. సత్యవేడు, గంగాధర నెల్లూరు నియోకవర్గ ఎమ్మెల్యేలు బహిరంగంగానే దీనిపై ఆరోపణలు చేయడం విశేషం. ఇవే ఆరోపణలు అనేక మంది నేతలు ఆఫ్ ది రికార్డుగా చేస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు సామర్థ్యం, అనుభవంపై నేతలకు నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం చంద్రబాబు ఇతర పార్టీల పై ఆధారపడుతుండటంతో కొంత నేతలు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ దక్కుతుందో? లేదో? అన్న టెన్షన్ కూడా వారిలో ఉంది. మిత్రపక్షాలు వత్తిడి తెస్తే ఏ నియోజకవర్గాన్ని అయినా వారికి అప్పగించేందుకు సిద్ధంగా ఉండేలా చంద్రబాబు వ్యవహార శైలి ఉందని నేతలు అభిప్రాయపడుతున్నారు. అందుకే గతంలో మాదిరిగా ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టడంలో నేతలు ముందుకు రావడం లేదు. ప్రధాన రీజన్ ఇక పార్టీలో తమకు ప్రాధాన్యత ఉంటుందో లేదో అన్న అనుమానమే వారిని సైలెంట్ గా మార్చేసిందంటున్నారు. మరొకవైపు చంద్రబాబు వ్యూహంపై అనేక మంది కార్యకర్తలు, నేతలకు నమ్మకం మాత్రం సడలలేదు. చంద్రబాబు అనేక సార్లు పార్టీ ఓటమి పాలయినా తిరిగి అధికారంలోకి వచ్చేలా చేయగలడంలో సక్సెస్ అయిన తీరును చూసి నేతలు నమ్మకంతో ఉన్నారు. అలాంటి వారికి కూడా ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ 175 నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్, ఓటు బ్యాంకు ఉంది. అలాంటి సమయంలో గెలుపోటములపై ఆధారపడకుండా పార్టీ నియోజకవర్గాల్లో బలహీన పడకుండా చేయాల్సిన బాధ్యత కూడా చంద్రబాబుపైనే ఉంది. మరి రానున్న కాలంలో భవిష్యత్ ఎలా ఉంటుందోనన్న బెంగ మాత్రం తెలుగు తమ్ముళ్లలో ఆందోళనను రేపుతుంది.

# జగన్ వర్సెస్ విజయ్ వర్సెస్ శివకుమార్

**విజయవాడ,(భారత శక్తి)** ఏమిటిది సినిమా టైటిల్ గా ఉందని అనుకోమాకండి. రాజకీయాల్లో ట్విస్టులు అలాగే ఉంటాయి మరి. తెర ముందు కొన్ని జరిగితే తెర వెనక జరగాల్సినవి ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే దక్షిణాదిన తమ రాజకీయ ఆధిపత్యాన్ని పూర్తి స్థాయిలో చూపించాలని కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి ఆరాటపడుతోంది. ఉత్తరాదిలో బీజేపీ హవా తగ్గుతూండడంతో దక్షిణాదిని పూర్తిగా తమ సొంతం చేసుకుని ఉత్తరాది మీద కూడా పట్టు సాధించాలని ఇండియా బ్లాక్ అయితే వ్యూహ రచన చేస్తోంది. ఈ క్రమంలో ఏపీ వైపు ఫుల్ ఫోకస్ పెడుతున్నారు అని అంటున్నారు. ఏపీలో చూస్తే రాజకీయం పూర్తి స్పష్టతగా ఉంది. బీజేపీతో జనసేన టీడీపీ కలసి ప్రయాణం చేస్తున్నాయి. 2029 ఎన్నికల్లోనూ మూడు పార్టీలు ఎన్డీయే కూటమిగానే వస్తాయని అంటున్నారు. ఈ విషయంలో బీజేపీ కూడా జాగ్రత్తగానే ఉంటుంది. టీడీపీ అలాగే జనసేన 2019 నాటి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కూటమిని బలోపేతం చేసే విధంగానే వ్యవహరిస్తున్నాయి. దీంతో ఏపీలో ఇండియా కూటమి పాగా వేయాలి అంటే జగన్ తో చెలిమి అనివార్యంగా కనిపిస్తోంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. కాంగ్రెస్ ఏ మాత్రం పుంజుకోకపోవడం వామపక్షాలు నామమాత్రం కావడంతో వైసీపీనే తిప్పుకోవాలని ఇండియా బ్లాక్ నేతలు చూస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే సడెన్ గా దక్షిణాదిన పరిణామాలు రాజకీయంగా వేగంగా మారిపోతున్నాయి. కర్ణాటకకు ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా వచ్చారు. ఆయనకు ఏకంగా వైఎస్సార్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అంతే కాదు జగన్ తోనూ మంచి పరిచయాలు ఉన్నాయని చెబుతున్నారు. జగన్ ప్రస్తుతం ఉంటోంది కూడా బెంగళూరులోనే అన్నది కూడా గుర్తుంచుకోవాలని చెబుతున్నారు. ఇక తమిళనాడుకు కొత్తగా ముఖ్యమంత్రి అయిన విజయ్ తోనూ జగన్ గుడ్ రిలేషన్స్ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. తాజాగా జూన్ 22న విజయ్ బర్త్ డే వస్తే జగన్ గ్రీట్ చేస్తూ ఎక్స్ ఖాతా ద్వారా ట్వీట్ చేశారు. అంతకు ముందు కూడా చెన్నైలో ఒక వివాహ వేడుకలో ఇద్దరూ కలుసుకుని ముచ్చటించుకున్నారు. అంతే కాదు విజయ్ గెలిచాక జగన్ ఆయనకు అభినందనలు తెలిపారు. విజయ్ వైపు నుంచి కూడా అదే విధమైన రెస్పాన్స్ వస్తోంది అని అంటున్నారు. దీంతో ఏపీలో రాజకీయ పరిణామాలు ఏమైనా జరగవచ్చు అని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి ఇండియా కూటమిలోకి జగన్ ని తీసుకుని వచ్చేలా అటు డీకే శివకుమార్ ఇటు విజయ్ కూడా తమదైన శైలిలో తీవ్ర ప్రయత్నం చేస్తారు అని అంటున్నారు. జగన్ కి వీరు సన్నిహితులు కావడంతో ఆ వైపు నుంచి కూడా పాజిటివ్ గా రెస్పాన్స్ ఉండొచ్చు అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇపుడే తొందరపడకుండా తగిన సమయంలోనే ఏపీ వ్యూహానికి ఒక లాజికల్ ఎండ్ తీసుకుని రావాలని అనుకుంటున్నారు అని చెబుతున్నారు. ఇక 2029 ఎన్నికల నాటికి ఎన్డీయే కూటమి గ్రాఫ్ బాగా తగ్గుతుందని ఇండియా బ్లాక్ నేతలు అంచనా వేస్తున్నారు. సౌత్ పార్ట్ అంతా తమ ప్యాకెట్ లో వేసుకుంటే నార్త్ లో కూడా సగానికి సగం అయినా సీట్లు గుంజుకుంటే కేంద్రంలో ఈజీగా ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు అన్నది ఇండియా బ్లాక్ పక్కా ప్లాన్ గా ఉంది. దానికి ఏపీ ఇపుడు అతి పెద్ద కీలకమైన పరిణామం కాబోతోంది అని అంటున్నారు.

# జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు

**కాకినాడ(భారత శక్తి)** పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని 2024 ఎన్నికల ముందూ తరువాత ఏపీ అంతా ఊగేలా స్లోగన్స్ చేసింది జనసైన్యం. పిఠాపురం అలా ఏపీ ఆంతా హాట్ టాపిక్ తొలిసారి అయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా పవన్ కళ్యాణ్ దే. ఎందుకంటే ఆయన వెండితెర మీద పవర్ స్టార్. ఆయన ఫాలోయింగ్ అన్నది ఊహాతీతం. ఆయన క్రేజ్ అన్నది అద్భుతం. అందుకే పిఠాపురం అన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. అది పవన్ అక్కడ నుంచి పోటీ చేయాలని ఎంచుకుని నిలిచి గెలిచిన తరువాత జరిగిన డెవలప్మెంట్స్ గానే వీటిని చూడాల్సి ఉంది.పిఠాపురం నుంచి పవన్ పోటీ చేసి గెలిచారు. ఆయన ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రెండేళ్ళ కూటమి పాలనలో కాపులకు న్యాయం జరగడం లేదని వైసీపీ కాపులంతా ఒక చోట చేరి మీటింగ్ పెట్టారు. అది కోనసీమ జిల్లా వేదికగా జరిగింది. ఈ మీటింగ్ తరువాత రాజకీయ ప్రకంపనలు ఒక రేంజిలో సాగుతున్నాయి. జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు అన్నట్లుగా రాజకీయం రంజుగా సాగుతోంది. ఈ మీటింగ్ తరువాత వైసీపీ నాయకురాలు వంగా గీత మీడియాతో మాట్లాడుతూ ఒక కామెంట్ చేశారు. పవన్ కులాన్ని తక్కువ చేయకూడదని అన్నారు. కాపులు ఎక్కువగా ఉన్నారనే కదా పిఠాపురం ఎంచుకుని పోటీ చేశారు అని ఆమె కామెంట్స్ చేశారు. అదే ఇపుడు ఏపీలో రాజకీయ పొలికేక గా మారిపోయింది. మరో వైపు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే జనసేన నేత పంతం నానాజీ అయితే హాట్ కామెంట్స్ చేశారు. పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తే తప్పేంటి అన్నారు. వంగా గీతది పిఠాపురం అమ్మ గారి ఊరా నాన్న గారి ఊరా అని ప్రశ్నించారు. అసలు ఎవరు ఎక్కడ నుంచి అయినా పోటీ చేయవచ్చు అని రాజ్యాంగంలో ఉందని అన్నారు. జగన్ పులివెందుల నుంచి బయటకు వచ్చి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ సత్తా ఏమిటో చూపిస్తామని పంతం నానాజీ రాజకీయ పంతమే పూనారు. ఈ సందర్భంగా ఆయన ఆవేశంలో జగన్ మీద అనుచిత వ్యాఖ్యలే చేశారు.

# బెబ్బులి దెబ్బ..

## ఏలూరు జిల్లాలో హైటెన్షన్..!

**ఏలూరు(భారత శక్తి)** జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా హల్‌చల్ చేస్తున్న పెద్దపులి తాజాగా బుట్టాయగూడెం మండలంలోకి ప్రవేశించింది. మండల పరిధిలోని నిమ్మలగూడెం శివారులో గల పాలకుంట చెరువు సమీపంలో పులి సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పాలకుంట చెరువు వద్ద మేతకు వెళ్లిన పశువుల మందపై పెద్దపులి ఒక్కసారిగా దాడికి తెగబడింది. ఈ దాడిలో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి.సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పులి అడుగు జాడలనుపరిశీలించారు. పశువుల మరణంతో స్థానిక రైతులు, గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో బుట్టాయగూడెం మండలం మరియు పరిసర గిరిజన గ్రామాల్లో అటవీ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. గ్రామాల్లో మైకుల ద్వారా అనౌన్స్‌మెంట్ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.సమీపంలోని అటవీ ప్రాంతాలకు, పొలాలకు ఎవరూ ఒంటరిగా వెళ్లకూడదని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఇళ్ల నుంచి బయటకు రావద్దని గిరిజనులకు గట్టిగా సూచించారు. అయితే, ఈ పులి కదలికలను ట్రాక్ చేయడం అధికారులకు కొంత సులువైంది. ఈ పులికి ముందే 'రేడియో కాలర్' అమర్చి ఉండటంతో, శాటిలైట్ సిగ్నల్స్ ఆధారంగా అది ఎటు వైపు వెళ్తోంది అనే విషయాన్ని అటవీ శాఖ ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. పులిని తిరిగి అడవిలోకి పంపించేందుకు లేదా పట్టుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఎవరూ అధైర్యపడకూడదని అధికారులు వెల్లడించారు.

# ఈ సారి కోలగట్ల శ్రావణి వంతేనా

**విజయనగరం,(భారత శక్తి)** విజయనగరం అంటేనే పూసపాటి వారి సంస్థానం. మూడు తరాలను చూసిన గడ్డ అది. రాచరికం అయినా ప్రజాస్వామ్యం అయినా పూసపాటి వారి హవాకు తిరుగులేదు. పీవీజీ రాజు నుంచి అశోక్ గజపతిరాజు దాకా అందరినీ విజయనగరం ప్రజలు ఆశీర్వదించారు. అశోక్ అయితే ఈ రోజున గోవాకు గవర్నర్ గా వెళ్లారు. ఆయన 1978 నుంచి 2009 దాకా ఏకంగా ఎనిమిది సార్లు పోటీ చేస్తే ఏడు సార్లు విజయనగరం అసెంబ్లీ నుంచి గెలిచి అనేకసార్లు మంత్రి పదవులు చేపట్టారు. ఇక కేంద్ర మంత్రిగా కూడా పనిచేసిన అశోక్ గవర్నర్ గా తన రాజకీయ జీవితాన్ని రాజ్యాంగబద్ధమైన పదవితో పూర్తి చేయనున్నారు అశోక్ కుమార్తెగా రాజకీయాల్లో వారసత్వంగా ముందుకు వచ్చిన అదితి గజపతి రాజు 2019లో ఓడి 2024లో గెలిచారు. 2019లో ఆమెను కోలగట్ల వీరభద్రస్వామి ఓడించారు. ఇక 2029లో అదితి గజపతి రాజు మీద పోటీ చేయబోయేది కోలగట్ల వారసురాలు అయిన శ్రావణి అని అంటున్నారు. తండ్రికి తగిన తనయగా ఆమె ఇప్పటికే పేరు తెచ్చుకున్నారు. విజయనగరం కార్పోరేషన్ కి డిప్యూటీ మేయర్ గా పనిచేసిన అనుభవం ఆమె సొంతం. దాంతో పాటుగా వైసీపీ పార్టీ కార్యక్రమాలలో ఆమె జోరుగా పాల్గొంటున్నారు. 2029 ఎన్నికల విషయంలో ఇప్పటి నుంచే కోలగట్ల శ్రావణి ప్రిపేర్ అవుతున్నారు: అశోక్ కుమార్తెగా రాజకీయాల్లోకి వచ్చినా తండ్రి మాదిరిగా జనంతో మమేకం కావడం లేదు అన్న విమర్శ అయితే అదితి గజపతిరాజుకు ఉందని అంటున్నారు. ఆమె కొద్ది మంది నేతల మీదనే ఆధారపడుతున్నారని అంటున్నారు. దాంతో పార్టీలోనూ కొంత అసంతృప్తి ఉందని చెబుతున్నారు. వీటిని ఆమె అధిగమించాల్సి ఉందని చెబుతున్నారు. రెండేళ్ళ పాలన అయితే పూర్తి అయింది, దాంతో ఇక మీదట గట్టిగా పట్టు బిగించాల్సి ఉందని చెబుతున్నారు. విజయనగరంలో వైసీపీకి కూడా పట్టు ఉంది. పైగా కోలగట్ల సామాజిక వర్గం కూడా అధికంగా ఉంది. దాంతో మాజీ ఉప సభాపతిగా ఉంటూ రెండు సార్లు ఎమ్మెల్యే ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన కోలగట్ల వీరభద్రస్వామి ఈసారి కుమార్తెని గెలిపించుకోవాలని పూర్వ రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

# పెండింగ్ సమస్యలపై యుద్ధం

**విశాఖపట్టణం,(భారత శక్తి)** ఏపీ టీడీపీ ప్రెసిడెంట్, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాకలో పెండింగ్ భూ సమస్యల మీద పిటిషన్ కమిటీ ముందు గళమెత్తారు. చిరకాలంగా అటు రెవిన్యూ ఇటు ఏపీఐఐసీ, పట్టణాభివృద్ధి శాఖలకు సంబంధించిన అనేక భూ సమస్యలను కమిటీ ముందు ఉంచారు. ఈ సమస్యలకు రెండు నెలల వ్యవధిలో పరిష్కరిస్తామని కమిటీ హామీ ఇవ్వడం విశేషం. ఇదిలా ఉంటే విశాఖ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్, శాసనసభ పిటిషన్స్ కమిటీ ఛైర్మన్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పిటిషన్స్ కమిటీ సమావేశంలో గాజువాక నియోజకవర్గం సమస్యల మీద పల్లా పూర్తి స్థాయిలో ప్రస్తావించారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతం.

దాంతో భూములను వివిధ పరిశ్రమల కోసం సేకరించడం జరుగుతోంది. అదే సమయంలో భూ సేకరణకు తమ భూములు ఇచ్చిన బాధితులకు నష్ట పరిహారం ఈ రోజుకీ చాలా కేసులలో దక్కలేదు. అంతే కాదు, నిర్వాసితుల పునరావాసం సమస్య ఉండనే ఉంది. అలాగే 22-ఏ సమస్యలతో పాటు పరిశ్రమల వల్ల ప్రభావితమైన కుటుంబాల హక్కులు కూడా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ ఉంది. వీటిని అన్నింటికీ కమిటీ ముందు పల్లా ఉంచారు. ఇక చినగంట్యాడ పరిధిలో అనేక గ్రామాలలో నివస్తున్న వందలాది కుటుంబాలకు ఇప్పటికే ఉన్న ఇళ్లకు జీవో నంబర్ 30 తరహాలో క్రమబద్ధీకరణ కల్పించాలని పల్లా కోరారు. అంతే కాదు ఆ ఇళ్ళు రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పల్లా డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధాన కార్యదర్శికి ప్రత్యేక సిఫార్సులు పంపాలని పిటిషన్ కమిటీకి సూచించారు.

అవసరమైతే కేబినెట్ ఆమోదంతో ప్రత్యేక విధానం తీసుకురావాలని కూడా పల్లా సూచించారు. దీనిపై పిటిషన్స్ కమిటీ సానుకూలంగా స్పందించడమే కాదు 90 రోజుల్లో కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించడం విశేషం. ఇక 22-ఏ పేరుతో అనేక భూములు చిక్కుకున్నాయని పల్లా పిటిషన్ కమిటీ ముందు ఉంచారు. అలా గాజువాకలోని వడ్లపూడి, చినగంట్యాడ, కూర్మన్నపాలెం, మిందీ, పెద్దగంట్యాడ, జగ్గరాజుపేట ప్రాంతాల్లోని నివాస కాలనీలు ఉండటంతో ప్రజలు కొనుగోలు, విక్రయాలు వంటివి లేకుండా పూర్తిగా ఇబ్బందిలో పడ్డారని ఆయన చెప్పారు. వీటిలఒ అర్హులైన నివాస ప్రాంతాలను 22-ఏ నుంచి తొలగించాలని పల్లా కమిటీని కోరారు. ఇక ఉక్కు నిర్వాసితుల ఆర్-కార్డుల డిజిటలైజేషన్ సమయంలో నకిలీ కార్డులు కూడా వచ్చాయని ఆయన చెప్పారు. దీంతో అనుమానాస్పదంగా ఉన్న 486 డౌట్‌ఫుల్ ఆర్-కార్డుల వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చెస్తామని కమిటీ హామీ ఇవ్వడం విశేషం

# జాయకా ఫుడ్ కోర్టు సీజ్



**హైదరాబాద్(భారత శక్తి)** సైబరాబాద్ పరిధిలోని కొండాపూర్ ఏఎంబీ మాల్ సమీపంలో జాయకా ఫుడ్ కోర్ట్ లైసెన్స్ రద్దు అయింది. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో నమ్మలేని నిజాలు వెలుగు చూసాయి. ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఈూూంఎ) లైసెన్స్ తక్షణమే సస్పెండ్ చేసారు. స్టోరేజ్ రూమ్లలో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఆహార ప్యాకెట్లను కొరికేసాయి. ప్యాకేజింగ్ నిల్వ ఉంచే ప్రాంతాల్లో భారీగా ఎలుకల రెట్టలు లభ్యమయ్యాయి. ఫ్రీజర్ పనిచేయకపోయినా అందులోనే నిల్వ ఉంచిన చికెన్ బిర్యానీ, కూరగాయలు కుళ్లిపోయాయి. ఎగ్ మయోనైస్ నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచారు. హోటల్ నిర్వాహకుల వద్ద మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్లు కానీ, పెస్ట్ కంట్రోల్ రికార్డులు కానీ లేవు. తనిఖీ చేసి అనుమతించే వరకు సదరు ఫుడ్ కోర్టు నడపకూడదని అధికారులు నోటీస్ జారీ చేశారు..

# విద్యుత్ అధికారులు నిర్లక్ష్యానికి కార్మికుడు



**మేడ్చల్:(భారత శక్తి)** బలికండ్లకోయలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సమయంలో సరఫరా నిలిపివేయకుండా పనులు చేయించడం వల్ల కార్మికుడు విద్యుత్ షాక్ కు గురయ్యాడు.ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.ఈ ప్రమాదానికి కారణమైన ఏఈ, లైన్ మెన్ ని సస్పెండ్ చేసి తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.దీంతో పోలీసులకు,బాధిత కుటుంబ సభ్యులకు వాగ్వదం జరిగింది.మృత దేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# ఐదో అంతస్తు నుంచి కిందపడి యువతి మృతి

**హైదరాబాద్ (భారత శక్తి)** మియాపూర్‌లో జరిగిన ఓ ఘటన తీవ్ర కలకలం రేపింది. మయూరి నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో 20 ఏళ్ల యువతి ప్రణవి ఐదో అంతస్తు నుంచి కిందపడి చనిపోయింది. క్షణాల్లో జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికులు షాక్‌కు గురయ్యారు. సాధారణంగా ప్రశాంతంగా కనిపించే ఈ ప్రాంతంలో ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో అపార్ట్‌మెంట్ పరిసరాల్లో ఆందోళన వాతావరణం ఏర్పడింది. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం.. ప్రణవి అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులోని పిట్టగోడపై కూర్చుని ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఫోన్ కాల్‌లో ఉండగా ఆమె బ్యాలెన్స్ కోల్పోయి ఒక్కసారిగా జారి కిందపడినట్లు పేర్కొంటున్నారు.. అయితే ఇది పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగిన ఘటననా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో కూడా పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే భారీ శబ్దం వినిపించడంతో అపార్ట్‌మెంట్ వాసులు బయటకు వచ్చి చూడగా యువతి తీవ్ర గాయాలతో నేలపై పడిఉన్నట్లు గుర్తించారు. తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ప్రణవిని రక్షించేందుకు ప్రయత్నించారు.. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానిక పోలీసు బృందం ఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర విషాదంలో మునిగిపోయారు. యువతి ఆకస్మిక మరణంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రణవి ఫోన్ కాల్ డేటా, ఆమె చివరి క్షణాల్లో ఎవరితో మాట్లాడిందనే వివరాలను సేకరిస్తున్నారు. అలాగే అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆమె పడిపోయిన సమయంలో అక్కడ ఎవరు ఉన్నారు..ㄱ ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఉన్నాయా అనే అంశాలపై కూడా విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనను అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నామని, ఇప్పటివరకు ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగానే అనుమానిస్తున్నప్పటికీ పూర్తి నివేదిక వచ్చిన తర్వాతే స్పష్టత వస్తుందని పోలీసులు పేర్కొన్నారు.

# దారుస్సాలామ్‌కి ఏమైంది..

**హైదరాబాద్(భారత శక్తి)** దారుస్సలామ్.. హైదరాబాద్‌లో ఈ పేరు తెలియనివారు ఉండరు. ఎంఐఎం పార్టీ కేంద్రకార్యాలయమే దారుస్సలామ్. ఒకప్పుడు .. ఈ కార్యాలయం వచ్చిపోయే వారితోనే కాదు.. పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిండుగా కిక్కిరిసి ఉండేది. తమ సమస్యలు చెప్పుకొనే వారు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చే వారు. పార్టీ చీఫ్.. అసదుద్దీన్ ఓవైసీ ఉన్నా.. లేకపోయినా.. పార్టీ కార్యాలయం మాత్రం నిండుగా కనిపించేది. ముఖ్యంగా యువత ఎక్కువగా ఇక్కడ తిష్ఠవేసుకుని పార్టీ కోసం పనిచేసిన పరిస్థితి కూడా ఉండేది. కానీ.. గత రెండు మాసాలుగా దారుస్సలామ్ బోసిపోయిన పరిస్థితిని నెలకొంది. వచ్చేవారు లేరు. వచ్చినా.. ఇక్కడ సమాధా నం ఇచ్చేవారుకూడా లేకుండా పోయారన్న వాదన వినిపిస్తోంది. హైదరాబాద్ ఎంపీగా అసదుద్దీన్ ప్రాతినిధ్యం వహిస్తున్నా.. జాతీయ రాజకీయాలపై ఆయన ఎక్కువగా దృష్టి పెట్టారు. యూపీ సహా.. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఎంఐఎం జాడలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లోనూ ఎంఐఎం పోటీ చేసింది. గతంలో బీహార్‌లోనూ పార్టీ పోటీ ఇచ్చింది.దీంతో అసదుద్దీన్.. జాతీయ రాజకీయాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారని తెలుస్తోంది. ఇక, ఆయన సోదరుడు, ఎమ్మెల్యే అక్బరు ద్దీన్ .. కేవలం అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పుడే కనిపిస్తున్నారని సమాచారం. ఎక్కువ భాగం.. విదేశాల్లోనే ఉంటున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో పార్టీకార్యాలయంలో కార్యక్రమాలు మందగించాయి. అదేసమయంలో వచ్చిపోయే వారి సంఖ్య కూడా తగ్గిపోయింది. ఇదిలావుంటే.. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల్లో ఎంఐఎం పార్టీకి ఏళ్ల తరబడి తిరుగులేదన్న వాదన తెలిసిందే అంతేకాదు.. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఓవైసీ కుటుంబానికి చెందిన నాల్గవ తరం వారసుడు అక్బరుద్దీన్ ఓవైసీ కుమారుడు నూరుద్దీన్ ఓవైసీ రాజకీయ రంగప్రవేశం చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. కానీ, ఆ జాడ కూడా ఎక్కడా కనిపించడం లేదు. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ ఇదే పాత బస్తీకి చెందిన మరో పార్టీకి అండగా ఉంటున్నదన్న సమాచంర హల్చల్ చేస్తోంది. దీంతో ఎంఐఎం ప్రభ తగ్గుతోందా? అనేది చర్చకు దారితీసింది. ఇక, జాతీయస్థాయిలో దృష్టి పెట్టినా.. ఎంఐఎంకు అనుకున్నంత మైలేజీ లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తోంది.

# రోజా అరెస్ట్ తప్పదా...?

**తిరుపతి,(భారత శక్తి)** వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా అరెస్టు తప్పదా? ఆమెపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన నివేదిక రెడీ అయిందా? ప్రభుత్వం కూడా చాలా సీరియస్‌గానే స్పందిస్తోందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. తాజాగా మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి స్పందిస్తూ.. రోజా సహా.. వైసీపీ హయాంలో శాప్ చైర్మన్‌గా వ్యవహరించిన బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, వాటిపై విజిలెన్స్ విచారణ కూడా పూర్తయిందని.. త్వరలోనే నివేదిక వస్తుందని తెలిపారు.వైసీపీ హయాంలో రోజా.. క్రీడల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని అమలు చేశారు. ఈ క్రమంలో సుమారు 150 కోట్ల రూపాయలు ఖర్చు చేసి క్రికెట్, వాలీబాల్, హాకీ సహా ఇతర క్రీడలకు సంబంధించిన వస్తువులను బల్క్‌గా కొనుగోలు చేశారు. అయితే.. ఇవన్నీ నాశిరకమేనని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. క్రికెట్ స్టిక్స్ విరిగి పోవడం.. బ్యాట్లు ముక్కలు కావడం అప్పట్లో ప్రధానంగా కనిపించింది.అలానే.. రాష్ట్ర వ్యాప్తగా ప్లే గ్రౌండ్స్ ను ఆధునీకరించే పేరుతో పెద్ద ఎత్తున కాంట్రాక్టు పనులు చేయించారు. దీనికిగాను 100 కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. అయితే.. ఈ పనులు కూడా నాశిరకంగా సాగాయని అప్పట్లో క్రీడాకారులు ఆరోపించారు. ఆయా పరిణామాలపై కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందిన ఫిర్యాదులతో విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ విచారణ పూర్తయి.. ప్రస్తుతం నివేదిక రూపొందిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు.క్రీడా పరికరాలు కొనుగోలు చేసే విషయంలోను.. మైదానాలను చదును చేసి మౌలిక సదుపాయాలు కల్పించే పేరిట మొత్తంగా 100 కోట్ల రూపాయల మేరకు అవినీతి జరిగిందని.. ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే విచారణకు ఆదేశించింది. ఈ నిధుల్లో రోజా, బైరెడ్డిలు సమానంగా పంచుకున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నివేదిక వచ్చిన వెంటనే రోజా అరెస్టు ఖాయమని టీడీపీ వర్గాలు చర్చిస్తున్నాయి. కాగా.. రోజా దీనిపై స్పందించేందుకు నిరాకరించారు.

## భారీ మేజారిటీతో గెలవకుంటే

# రాజకీయలకు రాజీనామా

**రంగారెడ్డి(భారత శక్తి)** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేసారు. 40,000 ఓట్ల మెజారిటీతో నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించారని వచ్చే ఎన్నికల్లో 80000 వేల ఓట్ల మెజార్టీతో గెలవకుంటే రాజకీయల నుండి తప్పుకుంటానని సంచలన వ్యాఖ్యలు చేసారు. కేవలం నియోజకవర్గంలో రోడ్ల కోసమే 700 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టమన్నారు. నేను కబ్జా పెట్టిన అని తెలిస్తే దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. మీరు చేసిన కబ్జాలన్నీ బయటపెట్టినందుకే తనపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచి రెడ్డి కిషన్ రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు. వచ్చే పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. అబ్దుల్లాపూర్ మెట్ రైతు సేవ సహకార సంఘం ఏర్పాటు చేసిన గోదాం శంకుస్థాపన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవడమే తన లక్ష్యమని దాన్ని కొరకే నిత్యం కృషి చేస్తానని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన అవినీతిని బయట పెట్టడం జరుగుతుందన్నారు. తను ఇంచ్ కబ్జా పెట్టిన దేనికైనా సిద్ధమని సవాల్ విసిరారు. తన నమ్ముకున్న తన కోసం పనిచేసే ప్రాణమిచ్చే కార్యకర్తల కోసం పనిచేయడమే తన తపన అని మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.

# మంత్రి ఆగ్రహం

**ఏలూరు (భారత శక్తి)** నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలో ఐ సి డి ఎస్ శాఖకు చెందిన కోడిగుడ్ల అక్రమ రవాణాను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారధిపట్టుకున్నారు. విషయంపై రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సంధ్యారాణి కి పిర్యాదు చేసారు. ఐసిడిఎస్ కోడిగుడ్ల అక్రమ రవాణాపై విచారణ చేసి , అక్రమ రవాణాదారుల పై చర్యలు తీసుకొని కాంట్రాక్టును రద్దు చేయాలని ఐసిడిఎస్ పీడీ ని మంతరి ఆదేశించారు.

# బొర్రా గుహల గిరిజన వ్యాపారుల షాపులను కొనసాగించాలి

**- ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు డిమాండ్**



**అరకులోయ(భారత శక్తి)** అనంతగిరి మండలం బొర్రా గుహల పరిసర ప్రాంతంలో జీవనోపాధి కోసం చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న 109 మంది గిరిజన వ్యాపారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు గారు అధికారులను కోరారు.బొర్రా వర్తక సంఘం సభ్యులు, గ్రామ పంచాయతీ పెద్దలు అరకులోయలోని ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు గారిని ఆయన తోటలోని వారి క్యాంపు కార్యాలయం వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను వివరించారు.బొర్రా గుహల అభివృద్ధి కోసం పర్యాటక శాఖ రూ.30 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న 109 షాపులను తొలగించి కేవలం 38 షాపులకు మాత్రమే డీపీఆర్‌లో స్థానం కల్పించడం వల్ల స్థానిక గిరిజన కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని తెలిపారు. దశాబ్దాలుగా చిన్న వ్యాపారాల ద్వారా జీవనం సాగిస్తున్న తమకు షాపులు తొలగిస్తే ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు.గిరిజనుల జీవనోపాధికి భంగం కలగకుండా గత డీపీఆర్‌ను సవరించి ప్రస్తుతం ఉన్న 109 మంది వ్యాపారులకు తగిన విధంగా షాపులు నిర్మించి ఇవ్వాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందన లేదని వ్యాపారులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు.వారి సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్సీ డా.కుంభా రవిబాబు గారు మాట్లాడుతూ, స్థానిక గిరిజనుల హక్కులు మరియు జీవనోపాధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గిరిజనులను నిర్లక్ష్యం చేయడం తగదని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా జిల్లా యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో పాటు డీవీఎం (ఆఎం) గారికి ఫోన్ ద్వారా విషయం తెలియజేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. గిరిజన వ్యాపారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే బొర్రా గుహల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.అలాగే బొర్రా గుహల ప్రవేశ రుసుము, జిప్‌లైన్ ఆదాయంలో గ్రామ పంచాయతీకి రావలసిన వాటాను చెల్లించాలని, గ్రామ పంచాయతీకి సంబంధించిన పెండింగ్ నిధులను విడుదల చేయాలని, మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణలో స్థానిక గ్రామ పంచాయతీకి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, బొర్రా మాజీ సర్పంచ్ జన్ని అప్పారావు, నాయకులు సుభాష్ చంద్ర, గుడివాడ ప్రకాశ్ రావు, వంతాల గురు నాయుడు, నానిబాబుతో పాటు బొర్రా వర్తక సంఘం సభ్యులు, గ్రామ పంచాయితీ పెద్దలు, స్థానిక నాయకులు, పంచాయితీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఏపీ స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్

**ఉండవల్లి:(భారత శక్తి)** ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ దేశానికి,ా్రష్టానికి గర్వకారణంగా నిలిచిన సాత్విక్ సాయిరాజ్ ను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సాత్విక్ సాయిరాజ్ అర్జున అవార్డుతో పాటు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు పొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించారు. ప్రస్తుతం పురుషుల డబుల్స్ విభాగంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 4వ స్థానంలో ఉన్నారు. 2023 అక్టోబర్ 10న డబుల్స్ విభాగంలో ప్రపంచ నంబర్-1 ర్యాంకును సాధించారు. ఇటీవల జరిగిన థామస్ కప్ లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో సాత్విక్ సాయిరాజ్ మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ ఎస్.భరణి పాల్గొన్నారు.

# కాపులు రాజకీయ ఆత్మపరిశీలన చేసుకోవాలి

**- శాశన మండలి బిజెపి పక్ష నేత సోము వీర్రాజు**

**అమరావతి,(భారత శక్తి)** రాష్ట్ర రాజకీయాల్లో కాపు సామాజిక వర్గం తమ రాజకీయ అస్తిత్వం, ప్రాధాన్యతపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ సీనియర్ నేత సోము వీర్రాజు అన్నారు. కాపుల కోసం పనిచేస్తామని చెప్పుకునే కొందరు నాయకులకు తమ పార్టీల్లోనే తగిన గౌరవం దక్కడం లేదని ఆయన వ్యాఖ్యానించారు.వైసీపీ ప్రభుత్వం కాపులను కేవలం రాజకీయ అవసరాల కోసం మాత్రమే ఉపయోగించుకుందని ఆయన విమర్శించారు. సీనియర్ నాయకులకు కూడా తగిన గుర్తింపు, ప్రాధాన్యత లేకుండా చేసిన ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, నేతలను నిర్ణయాత్మక పాత్రల్లో కాకుండా పరిమిత బాధ్యతలకే కట్టిపడేశారని ఆరోపించారు.కాపు రిజర్వేషన్ల అంశంపై మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రదర్శించలేదని అన్నారు. అయితే రాష్ట్రాలకు రిజర్వేషన్ల అమలుకు అవసరమైన అధికారాలను కేంద్ర ప్రభుత్వం కల్పించిందని గుర్తుచేశారు.రాష్ట్ర రాజకీయాల్లో కాపు అనే పేరును ప్రస్తావించడానికి కూడా కొన్ని రాజకీయ పక్షాలు వెనుకాడుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర జనాభాలో గణనీయమైన శాతం ఉన్న కాపులు తమ హక్కులు, అస్తిత్వం గురించి మాట్లాడటంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని స్పష్టం చేశారు.తెలుగుదేశం పార్టీ కాపు సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. పార్టీ కీలక కమిటీల్లోనూ, ఉన్నత పదవుల్లోనూ కాపులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

## గడువులోగా పెండింగ్ పనులు

# పూర్తి చేయండి

**- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**



**కరీంనగర్ (భారత శక్తి)**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లావ్యాప్తంగా మంజూరైన అభివృద్ధి పనులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీవో భవనాలు, ప్రహరీ, కిచెన్ షెడ్లు వేగవంతం చేసి వెంటనే ఈనెల 30 లోగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే.. అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈజీఎస్ పెండింగ్ పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. ఈజీఎస్ కింద మంజూరైన పనులు సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ గడువు తేదీలోగా నిర్దేశించిన లక్ష్యం చేరుకోవాలన్నారు. మంజూరైన పనులు ఆపకుండా తక్షణం గ్రౌండింగ్ చేసి ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జరుగుతున్న పనుల వివరాలు ఏఈలని అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలోమస్టర్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డీఆర్డీఓ గీత, పంచాయతీరాజ్ ఈఈ జనార్ధన్, అదనపు డీఆర్డీఓలు, జిల్లాలోని ఆరు సబ్ డివిజన్ల పంచాయతీరాజ్ డీఈలు, 15 మండలాల ఏఈలు పాల్గొన్నారు.

## గుంటుపల్లి ఎత్తిపోతల పథకం నుంచి

# సాగునీటి విడుదల

**- నారుమళ్ల అవసరాలకు సాగునీరు అందుబాటులోకి**

**ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం,(భారత శక్తి)** ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు గురువారం విడుదల చేశారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నారుమళ్లకు అవసరమైన నీటిని అందించేందుకు ఈ చర్య చేపట్టినట్లు తెలిపారు. గుంటుపల్లి ఎత్తిపోతల పథకం పరిధిలోని సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు ఈ నీటి విడుదలతో ప్రయోజనం చేకూరనుంది.ప్రస్తుతం వరి సాగు ప్రారంభ దశలో ఉండటంతో నారుమళ్ల పెంపకానికి నీటి కొరత లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు సూచించారు. రైతులు సకాలంలో సాగు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.వ్యవసాయ ఉత్పాదకత పెరగడంతో పాటు రైతుల ఆదాయం మెరుగుపడేలా సాగునీటి వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. నీటి వినియోగంలో రైతులు సమన్వయంతో వ్యవహరించి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు

## విద్యా వ్యవస్థను, పరీక్షల విధానాన్ని

# పూర్తిగా నిర్వీర్యం చేసిన కేంద్ర ప్రభుత్వం

**సికింద్రాబాద్(భారత శక్తి)** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థను, పరీక్షల విధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ మండిపడ్డారు. ఇటీవల నీట్ పరీక్షకు సంబంధించిన పరీక్ష పత్రాలు లీకైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతూ వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించడంలో పూర్తి విఫలమైందని తీవ్ర విమర్శలు చేశారు.నీట్ పరీక్ష రద్దవడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు లోనై ఆత్మహత్యలకు చేసుకున్నారని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు కట్టి నేర్చుకున్న విద్య పేపర్ లీకేజీతో పూర్తిగా నీరుగారిపోయిందని అన్నారు.. ఏ ఐ సి సి అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజల్లో విద్యార్థులలో ఎండగడుతున్నట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా లక్షలాదిమంది వైద్య విద్యార్థులు రాసి నీట్ పరీక్షకు సంబంధించి పరీక్ష పత్రాలు లీక్ అవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు తార్కానమని అన్నారు. ఇటీవల రద్దయిన నీట్ పరీక్ష కోసం దేశవ్యాప్తంగా 1,32,000 కోట్ల రూపాయలను విద్యార్థుల నుండి తీసుకున్నారని అన్నారు. విద్యార్థుల నుండి పరీక్షలు అన్నీ పద్యంలో తీసుకున్న 1,32,000 కోట్ల డబ్బు దాదాపు 5 రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కు సమానమని చెప్పారు. త్వరలోనే విద్యార్థులతో సమావేశమై నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులకు అన్ని వివరాలు తెలియజేస్తామని అన్నారు.

# తెలంగాణ కాలనీలో నాలుగు హత్యల కేసులో వీడిన మిస్టరి



**నల్గొండ(భారత శక్తి)** మృతురాలు హసీనా సొంత కూతురు-అల్లుడే హత్యలు చేయించినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సొంత కూతురుకు ఆస్తి దక్కడం లేదని కారణం తోనే హత్యలు జరిగాయి. ల్లగొండ జిల్లా కేంద్రం సాగర్ రోడ్డు తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన మహమ్మద్ సుల్తాన్ (45), ఆయన భార్య హసీన (40), కుమారుడు ముజమిల్(20), కుమార్తె అక్సర (11) అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి హైదరాబాద్ పాతబస్తీకి చెందిన నలుగురు రౌడీ షీటర్ల చేత అల్లుడు, కూతురు హత్య చేయించారు. హసీనాకు గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. నల్లగొండకు చెందిన మహ్మద్ సుల్తాన్ను మూడో వివాహం చేసుకుంది. సుల్తాన్కు కూడా గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. సుల్తాన్ మొదటి భార్య పిల్లలు మహ్మద్ ముజమిల్, అక్సరతో కలిసి నల్లగొండలో హసీన కాపురం వుంటోంది.హసీన పేరు మీద కోటి రూపాయల విలువైన స్థలాలు, ఇల్లులు ఉండడంతో.. ఆ ఆస్తిని తమకు ఇవ్వకుండా తన మూడో భర్త అయిన సుల్తాన్ పిల్లల మీద వీలునామా రాస్తున్నట్లు హసీనా చెప్పడంతో కక్ష పెంచుకొని, హసీన మొదటి భర్త కూతురు, అల్లుడు కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు పోలీసులు నిర్ధారించారు.పోస్టుమార్టం నివేదిక ప్రకారం.. సుల్తాన్ మృతదేహం పై 6 చోట్ల కత్తి గాయాలు ఉండగా, హసీనాకు 7 చోట్ల, కుమార్తె అక్సరకు 9 చోట్ల, ముజమిల్కు ఏకంగా 16 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. హంతకులకు భయపడి 11 ఏళ్ల అక్సర మంచం కింద దాక్కుంటే ఆమెను బయటకు లాగి చంపి ఉంటారని.. ఆమె మృతదేహం సగం మంచం కింద ఉండటాన్నిబట్టి అనుమానిస్తున్నారు.

# వెల్లటూరులో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన శాఖ ప్రారంభం.

**- ప్రారంభించిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం.**



**ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు(భారత శక్తి)** ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెల్లటూరు గ్రామంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీబీ) నూతన శాఖను గురువారం ఘనంగా ప్రారంభించారు. మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు , కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి శాఖను ప్రారంభించారు.రైతులకు, మహిళలకు చేరువలో బ్యాంకింగ్ సేవలు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, "సహకార రంగాన్ని బలోపేతం చేయడం, రైతులు, డ్వాక్రా మహిళలు, చిరు వ్యాపారులకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వెల్లటూరు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల చిరకాల కోరిక నేడు నెరవేరింది. ఈ నూతన శాఖ ద్వారా రైతులకు సకాలంలో పంట రుణాలు, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహకారం వేగంగా అందుతుంది" అని పేర్కొన్నారు.జిల్లాలో విస్తరిస్తున్న సహకార బ్యాంకింగ్.కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ, "రైతు సంక్షేమమే ధ్యేయంగా కేడీసీసీబీ పనిచేస్తోంది. వెల్లటూరు బ్రాంచి ఏర్పాటుతో ఈ ప్రాంత రైతులకు, మహిళా సంఘాలకు మరింత సౌలభ్యం కలుగుతుంది. డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, రికవరీలో మన బ్యాంకు రాష్ట్రంలోనే ముందంజలో ఉంది" అని తెలిపారు.అందుబాటులో సేవలు.నూతన శాఖ ద్వారా పంట రుణాలు, డ్వాక్రా రుణాలు, బంగారు రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు, డిపాజిట్ పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని బ్యాంకు అధికారులు వెల్లడించారు. రైతులు పాస్‌బుక్, ఆధార్ కార్డులతో నేరుగా లావాదేవీలు నిర్వహించుకోవచ్చు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేడెక్కిన నార్త్ పాలిటిక్స్

**లక్నో (భారత శక్తి)**త్వరలో కేంద్ర మంత్రివర్గంతో పాటు బీజేపీ సంస్థాగత నిర్మాణంలో పెద్ద ఎత్తున మార్పులకు అవకాశాలు కనిపిస్తున్నాయి. దాంతో ఉత్తరాదిన పాలిటిక్స్ హీటెక్కాయి. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. 2027 ప్రారంభంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో తమ పట్టును బలోపేతం చేసుకునే వ్యూహంలో భాగంగానే బీజేపీ కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కసరత్తు చేస్తోందని తెలుస్తోంది.కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజ్యసభ పదవీ కాలం ముగియడం, ఆయనను మళ్లీ ఎగువ సభకు పంపకూడదని నిర్ణయించడంతో కేంద్ర కేబినెట్‌లో కేరళ ప్రాతినిధ్యంపై కొత్త చర్చ మొదలైంది.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గంలో కేరళకు మరో అవకాశం ఉంటుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం కేరళ నుంచి ఉన్న ఏకైక బీజేపీ మంత్రి, నటుడు సురేష్ గోపి మాత్రమే. ఆయన త్రిసూర్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించి మోదీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. కేంద్ర కేబినెట్ భేటీ కానుందని, ఆ తర్వాత మంత్రుల శాఖల మార్పు లేదా కొత్త వారికి కేబినెట్ లోకి తీసుకోవడంపై ప్రకటన రావచ్చని తెలుస్తోంది. ఇద్దరు కేంద్ర మంత్రులు జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టూలను బీజేపీ మళ్లీ రాజ్యసభకు పంపలేదు. మరోవైపు బిట్టూ ఇంకా రాజీనామా చేయలేదు. అయితే, తాను పంజాబ్ రాజకీయాల్లోకి తిరిగి వస్తున్నానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు.'ఒక వ్యక్తి, ఒకే పదవి' బీజేపీ రూల్ పాటించడం ద్వారా మరో ఇద్దరు మంత్రులకు పదవీగండం ఉంది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన హర్ష్ మల్హోత్రా, ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి ఈ జాబితాలో ఉన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీజేపీ నిబంధనల ప్రకారం పంకజ్ చౌదరి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. 80 లోక్‌సభ స్థానాలు ఉన్న యూపీలో, గత అసెంబ్లీ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ బీజేపీకి గట్టి షాక్ ఇచ్చారు.దీంతో కేంద్ర ప్రభుత్వం పంకజ్ చౌదరి స్థానంలో మరో ఓబీసీ లేదా దళిత నేతకు.. ముఖ్యంగా పూర్వాంచల్ ప్రాంతానికి చెందిన వారికి మోదీ కేబినెట్‌లో చోటు కల్పించవచ్చు. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల (వెనుకబడిన, దళిత, మైనారిటీ) ఫార్ములాను తిప్పికొట్టేందుకు బీజేపీ ఈ మార్పుల ద్వారా కొత్త వారికి ఛాన్స్ ఇచ్చి యూపీలో సోషల్ బ్యాలెన్స్ సాధించాలని చూస్తోంది.వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రవ్‌నీత్ బిట్టూ రాజ్యసభ పదవీ కాలం ముగియడంతో పంజాబ్ నుంచి ఒక మంత్రి పదవి ఖాళీ అవుతుంది. బీజేపీ ఇక్కడ కేవల్ సింగ్ ఢిల్లాన్‌ను పంజాబ్ అధ్యక్షుడిగా నియమించింది. ఒక హిందువుకు కేబినెట్‌లో అవకాశం ఇస్తుందని సమాచారం. మంత్రి పదవి రేసులో రాఘవ్ చద్దా, సునీల్ జాఖడ్, తరుణ్ చుగ్ పేర్లు వినిపిస్తున్నాయి.గత కొన్ని సంవత్సరాలుగా మణిపూర్ హింసాత్మక జ్వాలల్లో నలిగిపోతోంది. ఇక్కడ మైతేయి, కుకీ వర్గాల మధ్య జాతి సంఘర్షణలకు పెద్ద చరిత్రే ఉంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంట్ వరకు మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తున్నాయి. ఎన్నికల కంటే ముందే ఏ వర్గంలోనూ అసంతృప్తి తలెత్తకుండా ఉండేందుకు, ఇక్కడి వివిధ వర్గాల నాయకులకు కేబినెట్ లేదా పార్టీ సంస్థాగత పదవుల్లో చోటు కల్పించి సమతుల్యతను సాధించాలని బీజేపీ భావిస్తోంది.

# మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద విషాదం



**చిత్తూరు(భారత శక్తి)** మామిడి లోడ్ ట్రాక్టర్ కింద పడి మామిడి రైతు మృతి చెందాడు.గుడిపాల మండలం సీకే పల్లి మాంగో జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద బుధవారం రాత్రి ప్రమాదం జరిగింది. యాదమరి మండలం కొట్టాల గ్రామానికి చెందిన అనిల్ మామిడి లోడ్ ట్రక్ కింద నిద్రిస్తుండగా.. అతని తమ్ముడు గమనించకుండా ట్రాక్టర్ స్టార్ట్ చేయడంతో అనిల్ మృతి చెందాడు. అనిల్ మృతితో మామిడి రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

## తాడిపత్రి పట్టణంలో పర్యటించిన

# మంత్రి టీజీ భరత్



**తాడిపత్రి జూన్ 25 (భారత శక్తి)** అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఇవాళ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పర్యటించారు. పట్టణానికి చేరుకున్న టీజీ భరత్ కు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో పూలతో ఘనస్వాగతం పలికారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి టీజీ భరత్, జేసీ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్యవైశ్య సభ్యులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## సమీకృత మండల కార్యాలయ సముదాయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



**సిద్దిపేట (భారత శక్తి)**జగదేవ్ పూర్ మండల కేంద్రంలోని సమీకృత మండల కార్యాలయ సముదాయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో సందర్శించారు. సమీకృత మండల కార్యాలయ సముదాయంన్నీ ప్రారంభించిన తర్వాత మొదటి సారి విచ్చేసినందుకు తహసీల్దార్ నిర్మల మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. భవన సముదాయం లోపల కలియ తిరిగారు. తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్, వీసీ హాల్, మీటింగ్ హాల్ గదులను పరిశీలిస్తూ సిబ్బంది అందరూ సౌకర్యంగా పనిచేసుకునే అన్ని సదుపాయాలు మెరుగుపరుచుకోవాలని తగు సూచనలు చేశారు. ఐఓసి మిగత కార్యాలయాలను కేటాయించిన వారు సైతం త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, అలాగే భూభారతి పెండింగ్ అప్లికేషన్లో సైతం త్వరగా డిస్పోజల్ చేయాలని తాసిల్దార్ ను ఆదేశించారు. జగదేవ్ పూర్ మండల కేంద్రం పరిధిలోని 41 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరు ఆక్రమణలకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ వేసి తరచూ మాటర్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ చంద్రకళ ఈడబ్ల్యుఐడిసి ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ నిర్మల,టిజి ఐఐ సి,ఇతర శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## మెడికల్ కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ ఉద్యోగుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

**- ఆరోగ్యశ్రీ డబ్బులు వెంటనే తమ ఖాతాలో జమ చేయాలి.**

**- ఎఐటియుసి, సీటు డిమాండ్.**

**అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు (భారత శక్తి):**ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జి.జి.హెచ్.) నందు నందు పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అమర్, జల్లి రాజబాబు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందర రావు పాల్గొని మద్దతు పలకడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జి.జి.హెచ్ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్య కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ సిబ్బందికి నాలుగు నెలల నుంచి బకాయి జీతాలు ఉన్నాయని అలానే ఆరోగ్య శ్రీ కి సంబంధించిన డబ్బులు తమ ఖాతాలో జమ చేయలేదని అలానే ఎఫ్.ఆర్.ఎస్ లో సాంకేతిక లోపాలు వలన విధులు నిర్వహించినప్పటికీ అటెండెన్స్ నమోదు కావట్లేదని అన్నారు. అదేవిధంగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ పది సంవత్సరాల పైబడి పని చేస్తున్న కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను, పర్మినెంట్ ఉద్యోగులు మాదిరిగా కొనసాగించాలని వారికి అందుతున్న అన్ని రకాల సౌకర్యాలు కూడా వీరికి అందాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయట్లేదని అన్నారు. అదేవిధంగా సరిపడా సిబ్బంది లేకపోవడం వలన తీవ్రమైన వత్తిడికి కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే జీజీహెచ్ ఆసుపత్రి నందు సరిపడా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై సంబంధిత అధికారి అయిన సూపర్డెంట్ వారికి తమ బాధలు తెలుపుతున్నప్పటికీ సమస్యలు పరిష్కరించమని వేడుకుంటున్నప్పటికీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య వైఖరి కనబరచటం జరుగుతుందని వాపోయారు. కావున తక్షణమే బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని, ఆరోగ్యశ్రీ డబ్బులు తమ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున ఆందోళనకి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంటాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు సునీత, ఆనంత్,మాయావతి,అన్నపూర్ణ,లవకుశ, సత్య,మురళి మోహన్ తదితర వైద్య సిబ్బంది లు పాల్గొన్నారు

## బంగారు ఫ్యాక్టరీపై గల ప్రేమ రైతుల పైన లేదు

**- ముఖ్యమంత్రి పర్యటనలో రైతులకు మొండి చేయి.**

**- వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్.**

**తుగ్గలి(భారత శక్తి):**మండల పరిధిలోని జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రసంగం స్థానికులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని, బంగారు కర్మాగారంపై గల రైతులపై లేదని వైసీపీ సీనియర్ నాయకులు కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, ఘాటుగా విమర్శించారు. భూములు కోల్పోయిన రైతులకు కనీసం సరైన నష్టపరిహారం కూడా ఇవ్వకుండా యాజమాన్యం మోసం చేస్తోందని వారు ఆరోపించారు."వందల ఎకరాల భూములిచ్చి రోడ్డున పడిన రైతుల గురించి సీఎం తన ప్రసంగంలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణం" అని జిట్టా నగేష్ యాదవ్ మండిపడ్డారు."గోల్డ్ మైన్స్‌తో రాయలసీమ రూపురేఖలు మారుతాయని చెప్పిన చంద్రబాబు,ఇక్కడి నిరుద్యోగులకు, భూములు కోల్పోయిన బాధితులకు ఏం న్యాయం చేస్తారో చెప్పలేదు. యాజమాన్యం ఇచ్చే తూతూమంత్రం పరిహారంతో, కొందరికే ఉద్యోగాలు ఇచ్చి నామమాత్రము జీతాలు ఇస్తూ వెట్టి చాకిరీ చేసుకుంటున్నారని రైతుల కుటుంబాలు ఎలా బతకాలి"అని ఆయన ప్రశ్నించారు. స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత అంటూ మాటలతో సరిపెట్టారని,కానీ భూములు ఇచ్చిన వారి పిల్లలకు కూడా ఉద్యోగాలు ఇచ్చేలా ఒప్పందంలో స్పష్టత లేదని వైసీపీ నేతలు ఆరోపించారు.రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, త్వరలోనే బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

# జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన యువతకు నియామక పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ నిషాంతి. టి



**అల్లూరిసీతారామరాజు జిల్లా పాడేరు, (భారత శక్తి),** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 24 వ తేది బుధవారం నాడు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని, అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాలకు వారి కంపినిలలో పనిచేయుటకు ఎంపిక చేశారు. ఈ జాబ్ మేళా ద్వారా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా కలెక్టరేట్ కార్యాలయంలో నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని జాబ్ మేళలో ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేసి ఈ ఉద్యోగాల నియామక పత్రాలు పొందిన వారు ప్రతి ఒక్కరు ఉద్యోగమే లక్ష్యంగా యువత ముందడుగు వేయాలని, పనిలో ప్రతిభ కనబరిచి శాఖలో ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నైపుణ్య అభివృద్ధి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగం లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉద్యోగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. "గ్రామీణ గిరిజన ప్రాంత యువతకు ఇలాంటి జాబ్ మేళాలు ఎంతో ప్రయోజనకరని,యువత తమ నైపుణ్యాలను పెంచుకుని మరిన్ని ఉపాధి అవకాశాలను అందుకోవాలని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ సంబంధించిన అధికారులుఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జి. ప్రశాంత్ కుమార్ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది, ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు, వారి తల్లి దండ్రులు జిల్లా కలెక్టర్ వారికి, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# గాయత్రీ మంత్రాన్ని ఉపాసిస్తే సృష్టికి ప్రతి సృస్థిచేసే శక్తి వస్తుంది

**- శ్రీశ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానుజ జియార్ స్వామి.**



**హైద్రాబాద్ (ఎల్ బి నగర్ )(భారత శక్తి)** ఎస్ వి ఎస్ ట్రస్ట్ మరియు శ్రీ వైష్ణవ సేవా రాష్ట్ర సంఘం- తెలంగాణ సంయుక్త అధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తి అన్ని జిల్లాలకు 8చెందిన శ్రీ వైష్ణవ వటువులు 50 మందికి " సామూహిక ఉచిత ఉపనయన సంస్కారం" కార్యక్రమం, ఎల్ బి నగర్ లోని ట్రస్ట్ భవనంలో నిర్వహింపబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య - అతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామివారు వటు వులందరికి " బ్రహ్మోప దేశాన్ని" చేశారు. ఈ సందర్భంగా వారు అనుగ్రహ భాషణం చేస్తూ గాయత్రీ మంత్ర) వైశిష్ట్యాన్ని వివరించారు. విశ్వామిత్ర మహర్షి 'గాయత్రీ మంత్రాన్ని ఉపాసించి సృష్టికి ప్రతిప్పష్టి చేశారని ,అంతటి శక్తిని పొందారని తెల్పారు - వటువులు నిత్యం గాయత్రిని ఉపాసిస్తే అమితమైన శక్తిని పొందుతారన్నారు .ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా పాల్లన్న శ్రీ శ్రీ శ్రీ (త్రి)దండి దేవనాథ జీయర్ స్వామి వారు వటువుల నుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తూ, ఉత్తమో త్తమజన్మా మానవ జన్మా అని మానవజన్మ పొందిన జీవునికి జరిపే సంస్కారాలలో భాగంగా "ఉపనయన సంస్కారం" ఉత్కృష్టమైనది అని తెలిపారు. ఈ ఉపనయన సంస్కారం ద్వారా వేదాద్యాయనం ప్రారంభము అతుందన్నారు. ఉపసయన సంస్కారం పొందనివాడు భ్రష్టు డౌతారని జన్మ వ్యర్థ మౌతుందన్నారు. గాయత్రి) ఉపాసన ద్వారా లౌకిక విధ్యలలో ఏకాగ్రత, చైతన్యత కల్గుతుందని తద్వారా ఉత్తమ సంస్కారం కలిగినవారుగా సమాజంలో చక్కని జీవితాన్ని గడువుతారని తెలిపారు. అనంతరం సంధ్యా వందనం పుస్తకాన్ని శ్రీ దేవనాథ్ జియార్ స్వామి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ాలూట్రస్ట్ ఛైర్మన్ కే. యాదగిరాచార్యులు జనరల్ సెక్రెటరీ లక్ష్మీనాథా చార్యాలు శ్రీ వైష్ణవ సేవా రాష్ట్ర సనీఘనీ తెలంగాణ, రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి పిచర కృష్ణ , పొడిచేటి రామకృష్ణ - ట్రస్ట్ సభ్యులు" శటగోపాచార్య-మాధవాచార్య - వరదా చార్యులు ,నరేంద్రా చార్యులు సంఘ నాయకులు, యాదగిరిచార్య - శశికిరన్ యాజ్ఞకులు జగన్నాధాచార్య, దరిపిల్ల లక్ష్మ నాచార్యులు, మరియు మహిళా విభాగాం అధ్యక్షురాలు ప్యారకీ అరుణ- గీత ,హైదరాబాద్ మహానగర కార్యవర్గసభ్యులు, శ్రీనివాసారి. జనార్ధనా చార్య తదితరులు నిర్వహించడంలో పాల్గొన్నారు. వటువులకు సంబందించి బంధువులు మిత్రులు 500 పైగా పాల్గొని దిగ్వజమం చేసినారు. వటువులకు దీక్షా వస్త్రాలు ఇతర సంబంధిత సామగ్రిని ఉచితంగా పంపినీ చేయడం పట్ల అందరు అభినందనలు వ్యక్తం చేసారు.

# పార్లమెంట్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

**- గిరిజన హక్కుల పరిరక్షణకు పార్లమెంట్‌లో నిరంతర పోరాటం**

**- బాక్సైట్, హైడ్రో ప్రాజెక్టుల సర్వేలను ఖండించిన ఎంపీ తనూజ రాణి**



**అరకులోయ (భారత శక్తి),**రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని లేకుండా చేయాలని ప్రతిపక్షాలు పగటి కలలు కంటున్నాయని, అయితే గతంలో కంటే వైసీపీ మరింత బలోపేతమై ప్రజల్లో ఆదరణ పొందుతోందని అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజా రాణి అన్నారు. అరకు పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నికై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం అరకులోయలో పార్లమెంట్ క్యాంపు కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ,గతంలో అరకు ఎంపీలు పార్లమెంటు కేంద్రంలో అందుబాటులోఉండటం లేదనే తీవ్ర విమర్శలు ఉన్నాయని, వాటిని అధికమించేందుకు ఈ క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో పార్లమెంట్ ప్రధాన కేంద్రంలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై ప్రతి వారంలో మూడు రోజుల పాటు ఈ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని, పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చని చెప్పారు. గిరిజనుల హక్కులు, చట్టాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించిన ఎంపీ, అలాంటి దుష్టపన్నాగాలను ప్రజలతో కలిసి తిప్పికొడతామని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన జీవో నంబర్ 3 అమలు కోసం ఇప్పటికే తొమ్మిది సార్లు లోక్‌సభలో ప్రస్తావించానని, సంబంధిత కేంద్ర మంత్రులతో పాటు రాష్ట్రపతిని కూడా కలిసి వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అరకు ఏజెన్సీలో హైడ్రో ప్రాజెక్టులు, బాక్సైట్ తవ్వకాల పేరుతో జరుగుతున్న సర్వేలను తీవ్రంగా ఖండించిన ఆమె, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 30 రోజుల్లోనే బాక్సైట్ తవ్వకాల రద్దుకు సంబంధించిన జీవో నంబర్ 97 తీసుకొచ్చారని గుర్తు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో నివాస హక్కుల కోసం సుమారు 1,800 మంది గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసు అంశాన్ని కూడా పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని ఆమె వెల్లడించారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల మెరుగుదలకు గత రెండేళ్లలో 10 అంబులెన్సులను అందించినట్లు పేర్కొన్న ఎంపీ, ఇప్పటివరకు సుమారు రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. అనంతగిరి మండలంలోని తరచూ ప్రమాదాలు జరిగే తారాబు జలపాతం అభివృద్ధికి ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.5 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మంచినీటి సమస్యల పరిష్కారానికి అరకు, పాడేరు నియోజకవర్గాల పరిధిలోని 36 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే గిరిజన హక్కుల పరిరక్షణలో కీలకమైన 1/70 చట్టం, పీసా చట్టం అమలు, ఇతర గిరిజన సమస్యలను రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించనున్నట్లు చెప్పారు. ఇటీవల కురుపాం, జి.కె.వీధి ప్రాంతాల్లో కలుషిత నీరు, ఆహారంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించిన ఆమె, విద్యార్థులుగిరిజన ప్రజలకు సంబంధించిన సమస్యలపై వైసీపీ ఎల్లప్పుడూ ముందుండి స్పందిస్తుందని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పర్యాటకం, వైద్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తున్నట్లు ఎంపీ తనూజా రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఎమ్మెల్సీ కుంభ రవిబాబు జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర మాజీ ఎమ్మెల్యే లు పాల్గుణ భాగ్యలక్ష్మి హైమావతి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గిరిజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంచానికే పరిమితమైన యువకుని కి హరీష్ రావు దాతృత్వం..



**సిద్దిపేట(భారత శక్తి)** తండ్రి కూలీ పని తల్లి బీడీలు చేస్తు జీవనం సాగిస్తున్న కుటుంబానికి పెద్దన్న అయిన హరీష్ రావుప్రమాదవశాత్తు కాలు విరిగిన యువకునికి రూ.5 లక్షల తో కృత్రిమ కాలు అందించి కుటుంబానికి ఆర్థిక భరోసానిచ్చిన హరీష్ రావు. పెద్దకోడూరు గ్రామానికి చెందిన యువకుడు రంజిత్ కు కృత్రిమ కాలు ఇచ్చి మరో సారి మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు. చిన్నకోడూరు మండలం పెద్ద కోడూరు గ్రామానికి చెందిన వరుకొలు మల్లేశం-సాలవ్వ దంపతుల కుమారుడు 20 ఏళ్ల యువకుడు రంజిత్ కు గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగి కాలు విరిగింది. చేతికి వచ్చే కొడుకు మంచానికె పరిమితం అయ్యాడని తల్లి తండ్రులు, నేను ఇక నా ఫ్రెండ్స్ తో కలసి పోలేను నేను పై చదువు లు చదువుకోలేను నా కాలు అడ్డంకి అనే ఆవేదన లో రంజిత్ బాధపడుతు,తల్లి తండ్రుల ఆసరా అవుతాడు అనుకునే సమయం లో కాలు విరిగింది కృత్రిమ కాలు తప్పితే ఎలాంటి దారి లేదు అని కృత్రిమ కాలు పెట్టకుందాం అనే అలోచన సిద్దిపేట లో తెల్సిన డాక్టర్ ని కన్సల్ట్ అయ్యారు అక్కడ రూ.8లక్షలు అవుతాయి అని వారు చెప్పడం తో అన్ని డబ్బులు మా వద్ద లేవుతండ్రి కూలీ పని, తల్లి బీడీలు చేస్తు జీవనం సాగిస్తున్నారు అంత ఆర్థిక స్థోమత అంత లేదు అని ఆందోళన చెందారు. అ సమయం లో హరీష్ రావు కలవాలి మాకు సహాయం కావాలి అని స్థానిక సర్పంచ్ సామల సునీత మధు ని కలసి హరీష్ రావు దగ్గరికి వచ్చారు. జరిగిన ప్రమాదం గురించి చెపుతు కృత్రిమ కాలు తప్ప వేరే దారి లేదు అని హరీష్ రావు కి వివరించారు. కానీ అంత డబ్బులు మా వద్ద లేవని ఆర్థిక భారం అవుతుందని చెప్పారు. అందుకు హరీష్ రావు నేను ఉన్న మీకు ఆందోళన చెందకండి నేను అండగా ఉంటానని..ఎన్ని డబ్బులు కానీ కృత్రిమ కాలు ఇప్పించే బాధ్యత నాదే అని మాట ఇచ్చాడు అ యువకునికి భరోసా కలిపించాడు కుటుంబానికి ధైర్యాన్ని నింపారు. మాట ఇచ్చాడు ఇచ్చిన మాటకు కృత్రిమ కాలు ను అందజేశారు. రూ.5 లక్షల రూపాయల తో యుకునికి కృత్రిమ కాలు ఇప్పించిన హరీష్ రావు. ఈ సందర్భంగా హరీష్ రావు కి వారు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తల్లి తండ్రులు ధన్యవాదములు తెలిపారు.

# రూ. 2కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

**- అనంతపురం జిల్లా బొంతవాడ గ్రామ శివార్లలో 108 ఎర్రచందనం దుంగలు డంప్ పై టాస్క్ ఫోర్స్ దాడి**

**- ముగ్గురు అనంతపురం జిల్లా స్మగ్లర్లు అరెస్ట్ - కారును సీజ్ చేసిన టాస్క్ ఫోర్స్**




**(భారత శక్తి)**ఎర్ర చందనం అక్రమ రవాణా ను అడ్డు కోవడం లో ప్రతేక ఆపరేషన్ చేపట్టిన రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అనంతపురం జిల్లాకు చెందిన నల్లాని నంద కుమార్( 32)నల్లాని జయ రామయ్య, బొట్టు రాఘవేంద్ర లను ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరికించి డిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్న ప్రధాన స్మగ్లింగ్ నెట్‌వర్క్ బట్టబయలు.టాస్క్ ఫోర్స్ బృందాన్ని టాస్క్ ఫోర్స్ హెడ్ శ్రీ యల్. సుబ్బ రాయుడు ఐ.పి.యస్ గారు ప్రత్యేకంగా అభినందించి రివార్డు లు ప్రకటించారు. శేషాచల అడవులలో ఎప్పటికప్పుడు ప్రత్యేక ఆపరేషన్ లు నిర్వహించడం తో పాటు, ఎర్ర చందనం కేసు లలో ముద్దాయిలు గా ఉంటూ తప్పించుకొని తిరుగుతున్న అంతర రాష్ట్ర స్మగ్లర్లను చట్టం ముందు నిలబెట్టడమే లక్ష్యంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా నిన్నటి దినం అనగా 24.06.2026 వతేదీ సాయంత్రం టాస్క్ ఫోర్స్ బృందం మరియు అటవీ సిబ్బంది కి రాబడిన ఖచ్చితమైన సమాచారంతో ముగ్గురు వ్యక్తులను అనంత పురం జిల్లా, నార్పల మండలం, బొందల వాడ గ్రామ పొలిమేరలో అదుపులోకి తీసుకోని వారి నుండి ఒక కారు తో సహా 109 ఎర్రచందనం దొంగలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. పై తెలిపిన ముద్దాయిలు ఒక ముఠా గా ఏర్పడి ఎర్ర చందనం చెట్లు నరికించి వాటిని డంప్ గా చేసి ఎక్కువ మొత్తం లో డబ్బులకు డిల్లీ, తమిళనాడు మరియు కర్ణాటక కు చెందిన భడా ఎర్ర చందనం స్మగ్లర్లుకు అమ్ముకుందాం అని కూలీల ద్వారా శేషాచలం అడవిలో ఎర్ర చందనం చెట్లు నరికించి వాటిని దుంగలు గా చేసి వాటిని అనంత పురం జిల్లా, నార్పల మండలం, అనంత పురం డివిజన్, రేంజ్ ఫారెస్ట్ సెక్షన్, దుర్గం ఫారెస్ట్ బీటు పరిధి లో బొందల వాడ గ్రామము నుండి బొమ్మలాట పల్లి గ్రామానికి వెళ్ళు మట్టి రోడ్డు మార్గం లో జయరామయ్య కు చెందిన పొలంలో ఉన్న ఒక రేకుల షెడ్ పక్కన డంప్ చేసి దాచిన 109 ఎర్ర చందనం దుంగల తో సహా పై ముగ్గురు వ్యక్తులను మరియు ఒక కార్ ను స్వాధీనం చేసుకోవడం అయినది. డిల్లీ, తమిళనాడు మరియు కర్ణాటక లోని ప్రధాన స్మగ్లర్లను అరెస్ట్ చేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. పట్టుబడిన మొత్తం 109 ఎర్రచందనం దుంగలు వాహనము తో సహా విలువ సుమారు 02 కోట్లు గా ఉంటుందని అంచనా వేయడం జరిగింది.ఈ స్మగ్లింగ్ లో ఇతర ప్రధాన సూత్రధారులను గుర్తించి వారిని అరెస్ట్ చేయడం జరుగుతుంది. అందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగింది.

## వీబీఆర్ కళాశాలలో ఘనంగా పోలీసుల అవగాహనా సదస్సు




**జూన్ 25 రేణిగుంట(భారత శక్తి)** :యువత సన్మార్గంలో నడిచి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనే సదుద్దేశంతో, గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని వీబీఆర్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒక భారీ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'ఈగల్' ఇన్‌స్పెక్టర్, గాజుల మన్యం సిఐ మంజునాథ్ ఎస్సై హరీష మరియు వారి పోలీసు బృందం పాల్గొని విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని క్షణికావేశంలో వ్యసనాలకు బానిసలైతే జీవితాలు మరియు కెరీర్ నాశనమవుతాయని హెచ్చరించారు. కళాశాల పరిసరాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఇన్స్పెక్టర్ మరియు గాజుల మన్యం సిఐ మంజునాథ్ ఎస్సై హరీష బి.వి.ఆర్ కళాశాల సిబ్బంది కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...

## 6 నెలల ప్లానింగ్.. 2004 ఫోన్ కాల్స్, 238 గంటల టాక్ టైమ్..

**- వణుకు పుట్టిస్తున్న మర్డర్ స్కెచ్..**

**(భారత శక్తి)** పూణేకు చెందిన ప్రముఖ రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఎంతో అంగరంగ వైభవంగా నిశ్చితార్థం జరిగి, నవంబర్‌లో ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో పెళ్లికి సిద్ధమైన ఒక జంట కథ.. చివరకు ఓ ఘోరమైన హత్యోదంతంగా ముగిసింది. కేతన్ కాబోయే భార్య సియా గోయల్ (20), ఆమె ప్రియుడు చేతన్ చౌదరి (22) కలిసి అత్యంత కిరాతకంగా ఈ మర్డర్ ప్లాన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. జూన్ 18న లోహగడ్ కోట లోయలోకి కేతన్‌ను తోసేసి, ప్రమాదవశాత్తు జరిగిందంటూ నమ్మించే ప్రయత్నం చేసిన ఈ ఇద్దరి కుట్రను పూణే రూరల్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో చేధించారు. ఈ ఘోరానికి వెనుక ఆరు నెలల సుదీర్ఘమైన ప్లానింగ్ ఉందని దర్యాప్తులో తేలింది. సియా, చేతన్ ఇద్దరూ గత ఆరు నెలల్లో ఏకంగా 2,004 సార్లు ఫోన్లలో మాట్లాడుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ దాదాపు 238 గంటల పాటు ఫోన్ కాల్స్‌లో గడపడమే కాకుండా, కొన్ని సంభాషణలు ఏకధాటిగా మూడు గంటల కంటే ఎక్కువ సమయం సాగాయని పూణే రూరల్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపారు. హత్య జరిగిన రోజు కూడా వీరిద్దరూ ముందుగా ఒక కేఫ్‌లో కలుసుకుని, లోహగడ్ కోటలో ఏ పాయింట్ నుంచి కేతన్‌ను లోయలోకి తోసేయాలో పక్కాగా స్కెచ్ వేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నిందితులూ పోలీసుల కస్టడీలో ఉన్నారు.అయితే, కేతన్‌ను మట్టుబెట్టడానికి వారు జూన్ 18 కంటే ముందే మూడు సార్లు విఫలయత్నాలు చేసినట్లు విచారణలో తేలింది. మొదట జూన్ 6న బాలిలో జరగాల్సిన వీరి ప్రీ-వెడ్డింగ్ ఫోటోషూట్‌ను చెడగొట్టడానికి, ఖలాపూర్ సమీపంలోని ఫుడ్ మాల్‌లో కేతన్ పాస్‌పోర్ట్‌ను సియా దొంగిలించి మహిళల వాష్‌రూమ్‌లో పడేసింది. ఆ తర్వాత మే 31, జూన్ 4 తేదీల్లో కేతన్‌ను లోహగడ్ కోటకు తీసుకెళ్లాలని చూసినా, ఒకసారి కేతన్ తల్లి వారించడంతో ఆ ప్లాన్ సాగలేదు. చివరకు జూన్ 14న కోటకు తీసుకెళ్లి లోయలోకి నెట్టేయగా.. కేతన్ అదృష్టవశాత్తు ఒక పొదను పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. అప్పుడు కంగారుపడిన సియా, అక్కడ పాము రావడంతోనే నువ్వు జారిపడ్డావని, నిన్ను తానే కాపాడానని నమ్మబలికింది. అయినప్పటికీ వదలకుండా జూన్ 18న మళ్లీ అక్కడికే తీసుకెళ్లి అనుకున్న కార్యాన్ని ముగించారు

## సాయి కృష్ణ కేసు ఈనెల 29 కు వాయిదా

**విజయవాడ (భారత శక్తి)**గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి పిటిషన్పై జిల్లా కోర్టు గురువారం విచారణ జరిపింది. జ్యుడీషియల్ విచారణ కోరుతూ సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. విజయలక్ష్మి తరుపున్యాయవాదులు వాదనలు వినిపించారు. కృష్ణలంక స్టేషన్, స్వర్గపురి లో సిసి ఫుటేజ్ మాయంపై న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. సీఐ నాగరాజుపై పటమట సీఐ విచారణ చేయటంపై అభ్యంతరం తెలిపారు. సాయికృష్ణ మృతదేహం ఏమైందో ఇప్పటికీ రిమాండ్ రిపోర్ట్ లో పేర్కొనలేదని అన్నారు.రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు పలు అంశాలు పేర్కొనలేదని వాదించారు. సిసి కెమెరా ఫుటేజ్ కోసం డిస్టిక్ లెవెల్ కమిటీకి కోర్టు నోటీసులు జారీచేసింది. విజయవాడ పోలీస్ కమిషనర్,విఎంసి కమిషనర్, కలెక్టర్ కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈనెల 29 కు వాయిదా వేసింది.

## 52వ డివిజన్‌లో మేయర్ పర్యటన

**- స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు**



**గోదావరిఖని (భారత శక్తి):** రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి 99 రోజుల ప్రజా పాలన పట్టణ ప్రగతి ప్రణాళికలో భాగంగా 52వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.అధికారులతో సమీక్ష నిర్వహించి రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో లో డిప్యూటీ మేయర్ ఎల్లయ్య స్థానిక కార్పొరేటర్ నాగరాజు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**కరీంనగర్(భారత శక్తి)** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా పోలీస్, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసి మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతోందని తెలిపారు. డ్రగ్స్ వల్ల వ్యక్తిగత, కుటుంబ సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొంటూ, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

## అంబట్ పల్లిలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్





**జయశంకర్ భూపాలపల్లి.(భారత శక్తి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం లోని అంబటిపల్లి గ్రామంలో అక్రమ కార్యకలాపాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నివారణ లక్ష్యంగా గురువారం తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ( నాకాబంది ) ఆపరేషన్ నిర్వహించారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ ఆదేశాల మేరకు మహదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో, మహదేవపూర్ ఎస్‌హెచ్ ఓ సాంబమూర్తి, మహదేవ్‌పూర్ ఎస్ఐ జె. రమేష్ , కాళేశ్వరం ఎస్ఐ భగవంత్,పలిమేల ఎస్ ఐ సాయి శశాంక్, మరియు పోలీసు సిబ్బంది గ్రామాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని ఇంటింటి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలను సేకరించి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా 30 లీటర్ల గుడుంబాను సీజ్ చేసారు, మొత్తం 65 వాహనాలను తనిఖీ చేయగా, నంబర్ ప్లేట్లు లేని 6 వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు మరియు ఇతర రికార్డులను పరిశీలించారు. డిక్యుమెంట్ లేని వాటికీ జరిమానా వేయడం జరిగింది, అలాగే గ్రామంలో గుడుంబా వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుడుంబా సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాల పెరుగుదల మరియు సామాజిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. ప్రజల సహకారంతో గ్రామంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని, ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి



**మంచిర్యాల:(భారత శక్తి)** రామగుండం పోలీస్ కమిషనరేట్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వర్షాకాలంలో విధి నిర్వహణకు ఉపయోగపడే రెయిన్ కోట్లను ఆయన పంపిణీ చేశారు. ఎండనకా, వాననకా కష్టపడి పనిచేసే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్ కోట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## గోపవరం మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు




**బద్వేలు (భారత శక్తి)**బద్వేల్ పట్టణంలో భాగమైన గోపవరం మండలంలోని గోపవరం గ్రామ పొలం 1983/1, 1984/1 లోని 3.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆర్డిఓ చంద్రమోహన్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు గోపవరం మండల తాసిల్దార్ జీవన్ తెలియజేశారు.. అలాగే గోపవరం గ్రామ పొలం 1848, 1852 సర్వే నెంబర్లలోని 80 సెంట్లు భూమి, అలాగే 1852 లోని మరో ఒకటిన్నర ఎకరా ప్రభుత్వ భూమిలో కూడా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని తాసిల్దార్ పేర్కొన్నారు.

## ఎమ్మార్వో సుచరిత నివాసాల్లో మరోసారి ఏసీబీ సోదాలు

**హైదరాబాద్(భారత శక్తి)** మరోసారి శామీర్పేట్ ఎమ్మార్వో సుచరిత నివాసాల్లో మరోసారి ఏసీబీ సోదాలు జరిగాయి. గతంలో సుచరిత పై అక్రమాస్తుల కేసు ఏసీబీ నమోదు చేసింది. ప్రస్తుతం సుచరిత ఏసీబీ కేసులో జైల్లో ఉంది. మే 26న శామీర్పేట్ ఎంఆర్ఓ కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరిగాయి. రైతుల నుండి 30 లక్షలు లంచం డిమాండ్ చేసిన సుచరిత, నాలా కన్వర్షన్ కోసం అడ్వాన్సా తన డ్రైవర్ ద్వారా రెండు లక్షల లంచం తీసుకుంటూ రెడ్యాండెడ్గా ఏసీబీకి పట్టుబడింది. ఆమెపై తాజాగా అక్రమాస్తుల కేసు ఏసీబీ నమోదు చేసింది. హైదరాబాదులోని ఎమ్మార్వో సుచరిత నివాసాలతో పాటు వారి బంధువుల నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. .!

## స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి



**అమరావతి(భారత శక్తి)** ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. శ్రీలక్ష్మి 1988 బ్యాచ్కు చెందిన ఐఏఎస్ అధికారిణి. ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



## చేతులు వేయడం, చనువు తీసుకోవడం ఇండస్ట్రీలో ప్రతి స్టేజ్‌లోనూ ఉంది

ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత సినిమా పరిశ్రమలోని చీకటి కోణాలపై, ముఖ్యంగా మహిళల సేఫ్టీపై అత్యంత భయంకరమైన నిజాలను బయటపెట్టారు. ఇటీవల హేమ కమిటీ రిపోర్ట్, ఆ తర్వాత ఇండస్ట్రీలో మహిళల రక్షణపై డిబేట్స్ నడుస్తున్న తరుణంలో... సునీత తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్‌ను షేక్ చేస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీ కొత్తగా వచ్చే అమ్మాయిలకు ఎంతవరకు సేఫ్? అనే ప్రశ్నపై ఆమె స్పష్టంగా మాట్లాడారు. ఇండస్ట్రీలో కొనసాగడం అంత ఈజీ కాదని సునీత అన్నారు. “ఒక అమ్మాయి ఇండస్ట్రీకి రావాలంటే ఆమెకు కచ్చితంగా నాలుగు శక్తులు ఉండాలి. అవి.. ఎమోషనల్ (మానసిక స్థైర్యం), ఫిజికల్, మెంటల్, ఫైనాన్షియల్ స్ట్రెంత్స్. ఈ నాలుగూ లేకపోతే ఇండస్ట్రీ ఇక్కడ ప్రతి క్షణం నరకం చూపిస్తుంది. కఠినమైన పరీక్ష పెడుతుంది. ఇండస్ట్రీ అసలు సేఫ్ కాదు” అని స్పష్టం చేశారు. ఇండస్ట్రీలో అథారిటీ, పవర్ చేతుల్లో పెట్టుకున్న కొందరు వ్యక్తులు... అవతలి వారి బలహీనతలను ఎలా క్యాష్ చేసుకుంటారో సునీత దాపరికం లేకుండా వెల్లడించారు. “ఇక్కడ పవర్ ఉన్నవాళ్లు అవతలి వారిని వేధించాలని లేదా వాడుకోవాలని చూస్తారు. కేవలం కొత్తగా ఛాన్సుల కోసం వచ్చే వాళ్లనే కాదు... ఇండస్ట్రీలో ఆల్రెడీ మంచి పేరు, క్రేజ్ తెచ్చుకున్న వాళ్లను కూడా వదలరు. చేతులు వేయడం, అనవసరమైన చనువు తీసుకోవడం వంటివి ప్రతి స్టేజ్‌లో ఉంటాయి” అని తెలిపారు. “ఒక మగాడు ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నాడో... ఆ మాటల్లోనే లేదా అతడు తాకిన ఒకే ఒక్క టచ్‌లోనే ఆడపిల్లలకి వెంటనే తెలిసిపోతుంది.

చాలా మంది వేరే దారి లేక, సినిమా అవకాశాల కోసం అవన్నీ భరిస్తూ లోపల ఏడుస్తారు. కానీ, నాలాంటి వాళ్లు మాత్రం ఆ పనులు చేయకుండా, అలాంటి వాతావరణం నచ్చక ఇండస్ట్రీ నుండి బయటకు వచ్చేస్తారు” అని సునీత చెప్పారు.



## ఈ సినిమా హాలీవుడ్ హద్దులను చెరిపేసింది

వరల్డ్ స్టార్ ప్రియాంక చోప్రా, చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టాలనుకునే కొత్త టాలెంట్‌కు ఇప్పుడు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక మంచి ఆలోచన ఉంటే చాలు, తక్కువ బడ్జెట్‌తోనూ ప్రపంచవ్యాప్తంగా విజయం సాధించవచ్చని, ఇటీవల విడుదలై సంచలనం సృష్టించిన హారర్ సినిమా ‘అబ్సెషన్’ దీనికి చక్కటి ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు. బుధవారం కేన్స్ లయన్స్ సదస్సులో పాల్గొన్న ప్రియాంక, మారుతున్న సినిమా ప్రపంచంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ‘అబ్సెషన్’ వంటి సినిమాలతో హాలీవుడ్ హద్దులు చెరిగిపోతున్నాయని అభిప్రాయపడ్డారు.“మీ దగ్గర ఒక ఐడియా ఉంటే, దాన్ని షూట్ చేసి యూట్యూబ్‌లో పెట్టండి. అది ‘అబ్సెషన్’ లాంటి పెద్ద హిట్ సినిమా కూడా కావచ్చు. వినోద రంగంలో ఉండటానికి ఇది సరైన సమయం, ఎందుకంటే ఇప్పుడు మీ ఆలోచనలే మీ ఆస్తి” అని ప్రియాంక తెలిపారు. ఒకప్పుడు పరిస్థితి ఇలా ఉండేది కాదని ఆమె గుర్తుచేసుకున్నారు.గత పదేళ్లుగా హాలీవుడ్‌లో కెరీర్ నిర్మించుకుంటున్న ప్రియాంక, తాను పరిశ్రమలోకి అడుగుపెట్టినప్పుడు ఎదుర్కొన్న సవాళ్లను పంచుకున్నారు. “మా తల్లిదండ్రులు డాక్టర్లు. మాకు ఇండస్ట్రీలో ఎవరూ తెలియదు, ఎలా ముందుకు వెళ్లాలో కూడా అవగాహన లేదు. అప్పట్లో సినిమా అనేది కొందరికే పరిమితమైన రంగం” అని అన్నారు.తన కెరీర్ తొలినాళ్లలో భారతీయ సినిమాలు ఎప్పటికీ హాలీవుడ్ అంతటి ప్రపంచ స్థాయికి చేరలేవని చాలామంది అనేవారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్త ఫిల్మ్ మేకర్స్‌ను, మంచి ఐడియాలు ఉండి అవకాశాలు రాని వారిని ప్రోత్సహించేందుకు తాను నిర్మాణ సంస్థను ప్రారంభించినట్టు వెల్లడించారు. హిందీలో ఎందరో గొప్ప దర్శకులు, నటులతో పనిచేశానని, కానీ హాలీవుడ్‌లో ఆ స్థాయిలో ఇంకా విభిన్నమైన పాత్రలు చేయలేదని, ఆ దిశగా ప్రయత్నిస్తున్నానని ప్రియాంక తెలిపారు. స్ట్రీమింగ్ సర్వీసులు, కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు అన్ని భాషల కంటెంట్‌ను చూడటం మొదలుపెట్టారని ఆమె అభిప్రాయపడ్డారు.


## డెడ్లీ డాక్టర్‌గా రజనీకాంత్..

### - ‘ధర్మన్’ టైటిల్ మేకింగ్ వీడియో విడుదల





అగ్ర కథానాయకుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 173వ సినిమాతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ‘ధర్మన్’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తలైవా ‘ది డెడ్లీ డాక్టర్’ అవతారంలో కనిపించనున్నారు. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా రజనీకాంత్ పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ‘డ్రాగన్’ ఫేమ్ అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రజనీ, కమల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత సినిమా రావడం విశేషం. ఈ చిత్రంలో సిమ్రన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు.తాజాగా చిత్రబృందం ‘ది ఓజీ స్వాగ్’ అనే క్యాప్షన్‌తో టైటిల్ పోస్టర్ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో రజనీకాంత్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి అభిమానులను ఫిదా చేస్తున్నాయి. డాక్టర్ కోట్‌లో స్టెతస్కోప్‌తో, సీరియస్ లుక్‌లో తలైవా లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యాయం కోసం ఏ స్థాయికైనా వెళ్లే డాక్టర్‌గా రజనీకాంత్ ఈ సినిమాలో కనిపిస్తారని టాక్. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ‘ధర్మన్’ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. రజనీ మార్క్ యాక్షన్, డైలాగ్స్, ఎమోషన్‌తో పాటు సామాజిక అంశాలను టచ్ చేసే కథతో ఈ సినిమా రూపొందుతోందని తెలుస్తోంది.

## దక్షిణాదిలో ఆ స్వేచ్ఛ లేదు!



దక్షిణాది సినీరంగంపై అగ్ర కథానాయిక తమన్నా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దక్షిణాది సినిమాల్లో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుందని, కథానాయికల్ని గ్లామరస్‌గా చూపించడానికే అధిక ప్రాధాన్యతనిస్తారని తమన్నా వ్యాఖ్యానించింది. ‘హిందీ చిత్రసీమలో రెండు రకాల నటులుంటారు. కొందరు అభినయప్రధాన పాత్రల్ని ఎంచుకొని కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటారు. మరికొందరేమో కేవలం గ్లామర్‌కే పరిమితమవుతారు. బాలీవుడ్‌లో ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. కానీ దక్షిణాదిలో మాత్రం నటన, గ్లామర్‌ను బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది’ అని తమన్నా పేర్కొన్నది. ఆమె మాటలపై దక్షిణాది అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తెలుగు, తమిళం ద్వారానే స్టార్‌డమ్‌ను సంపాదించుకొని విశ్వాసం లేకుండా ఇలాంటి మాటలు మాట్లాడటం తగదని నెటిజన్లు సోషల్‌మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.

## ‘రణబాలి’లో అదే హైలైట్!



అగ్ర హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న పీరియాడిక్ చిత్రం ‘రణబాలి’ నిర్మాణం నుంచే భారీ హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. 19వ శతాబ్దం నాటి ఈ కథలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడే యోధుడిగా విజయ్ దేవరకొండ కనిపించనున్నారు. ఈ చిత్రంలో హాలీవుడ్ నటుడు, ‘ది మమ్మీ’ ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ ప్రధాన ప్రతినాయకుడు పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ‘అత్యంత క్రూరుడైన కరువు నేల రాక్షసుడు’ అనే క్యాప్షన్‌తో ఆయన పాత్రను పరిచయం చేస్తూ ఇటీవలే ఫస్ట్‌లుక్‌ని రిలీజ్ చేశారు.ఈ నేపథ్యంలో దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ ‘రణబాలి’ గురించి సోషల్‌మీడియా ద్వారా ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ, ఆర్నాల్డ్ వోస్లూ మధ్య వచ్చేక్లైమాక్స్ ఘట్టాలు రోమాంచితంగా సాగుతాయని, దాదాపు 16 రోజుల పాటుక్లైమాక్స్ షూట్ జరిపామని చెప్పారు. ‘సినిమాకు గ్లోబల్ అప్పీల్ ఉండాలనే ఉద్దేశ్యంతో ఆర్నాల్డ్ వోస్లూని విలన్‌గా తీసుకున్నాం. షూటింగ్ కోసం ఆయన ఆరు నెలల పాటు హైదరాబాద్‌లోనే ఉన్నారు. పతాక సన్నివేశాలను లార్జ్‌స్కేల్‌లో డిజైన్ చేశాం. సినిమాలో అవే హైలైట్‌గా నిలుస్తాయి’ అని రాహుల్ సాంకృత్యాన్ తెలిపారు. సెప్టెంబర్ 11న ‘రణబాలి’ ప్రేక్షకుల ముందుకురానుంది.

## ఓ ఉపాధ్యాయుడి కథ ‘సూపర్ సుబ్బు’

సందీప్‌కిషన్, మిథిలా పాల్కర్ జంటగా నటిస్తున్న కామెడీ వెబ్‌సిరీస్ ‘సూపర్ సుబ్బు’ ట్రైలర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సిరీస్ జూలై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఇందులో సందీప్‌కిషన్ సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు అనే ఉపాధ్యాయుడి పాత్రలో కనిపించనున్నారు. మాకిపూర్ అనే గ్రామానికి టీచర్‌గా వెళ్లిన అతనికి అక్కడ ఎదురైన పరిస్థితులు, జీవితాన్ని మార్చే సంఘటనల నేపథ్యంలో ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. ఈ సిరీస్‌లో సాధారణ ప్రజలు మాట్లాడటానికి సంకోచించే ఓ సీరియస్ అంశాన్ని హాస్యం, భావోద్వేగాలు మేళవించి చెప్పే ప్రయత్నం చేశామని, సమస్యను పరిష్కరించాలనుకొని తానే ఇబ్బందుల్లో చిక్కుకునే ఉపాధ్యాయుడిగా తన పాత్ర ఆద్యంతం వినోదభరితంగా సాగుతుందని సందీప్‌కిషన్ తెలిపారు. హాస్యంతో పాటు మానవ సంబంధాల ఆవశ్యకతను చర్చించే సినిమా ఇదని కథానాయిక మిథిలా పాల్కర్ పేర్కొన్నది. ఈ సిరీస్‌లో బ్రహ్మానందం, గెటప్ శ్రీను, మానస చౌదరి తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. మల్లిక్‌రామ్ దర్శకత్వం వహించారు.



## డబుల్ బెడ్ రూమ్ పేరిట మోసాలు

**- ముగ్గురు అరెస్టు**

**మల్కాజ్ గిరి(భారత శక్తి)** సికింద్రాబాద్.. అల్వాల్ పీఎస్ పరిధిలో రెండు పడక గదుల ఇళ్లను ఇప్పిస్తామంటూ ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసారు. పుష్పలత, విశాల్, మహేందర్ సింగ్ లను అరెస్టు చేశాం. మరో నలుగురి కోసం గాలిస్తున్నామని డీసీపీ శ్రీధర్ వెల్లడించారు.అల్వాల్ లో ఉండే జయరాజ్ ప్రభుత్వ కార్యాలయాలలో పైరవీలు చేస్తూ ఉంటాడు. పుష్పలత గతంలో జి.హెచ్.ఎం.సి లో విధులు నిర్వహించేవారు. జయరాజ్,పుష్పలత కలిసి ప్రజలకు రెండు పడక గదుల ఇళ్ళు ఇస్తామని నమ్మించారు. అదే అదునుగా తీసుకుని అల్వాల్ పరిధిలో పరిచయమున్న వ్యక్తులకు లక్ష రూపాయలకే ఇళ్లు ఇస్తామని నమ్మించారు. దాదాపు 2023 నుండి 99 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారని అయన అన్నారు.పలు దఫాలుగా వీరి నుండి డబ్బులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సంప్రదించగా వీరికి రెండు పడక గదుల ఇళ్ళు కేటాయించలేదని తేలడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో పారదర్శకత ఉంటుంది కాబట్టి ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని అయన సూచించారు.

## పెద్దవంగలి గ్రామంలో రైతన్న మీకోసం



**చాగలమర్రి (భారత శక్తి)** చాగలమర్రి మండలంలోని పెద్దవంగలి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ ఆధ్వర్యంలో "రైతన్న మీకోసం" కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ప్రభుత్వం రైతుల అభివృద్ధి కొరకు సబ్సిడీ ద్వారా బిందు మరియు తుంపర సేద్య పరికరాలు అందించడం, వ్యవసాయ పనిముట్లు, ఏ. పి. ఏ. ఐ. ఎం.ఎస్ ఆప్ ద్వారా రైతులకు పంటకు శాస్త్రవేత్తల సిఫార్సు మేరకు ఎరువుల పంపిణీ, రైతు విశిష్ట సంఖ్య నమోదు, ఎల్ నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటితో పండే పంటలు సాగు చేసుకోవడం, సూక్ష్మ నీటి సాగు పద్ధతులు పాటించడం, వర్షపు నీటిని నిల్వచేసుకోవడానికి ఫార్మ్ పాండ్ లను ఏర్పరచుకోవడం వంటి వివిధ ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. తదుపరి ప్రకృతి వ్యవసాయ డి.పి.ఎం గారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా నేల ఆరోగ్యం కాపాడటమే కాకుండా రైతులకు తక్కువ పెట్టుబడితో మంచి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చును. నేటి ఆధునిక కాలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పండించిన పంటకు మంచి ధర వస్తుందని తెలిపారు. తదుపరి పి.ఎం.డి.ఎస్ క్రింద పెద్దవంగలి గ్రామానికి చెందిన వెంకట రామయ్య గారి పొలంలో 30 రకాల విత్తనాలు కలిపి చల్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### దేవాలయ శంకుస్థాపన చేసిన

## ఎమ్మెల్యే యరపతినేని



**మాచవరం(భారత శక్తి)** పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, మాచవరం మండలం, పిన్నెల్లి గ్రామం నందు శ్రీ సీతారామ వేణుగోపాల స్వామి వార్ల నూతన దేవాలయం (పునర్నిర్మాణం) శంఖుస్థాపన సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో తులత ఎమ్మెల్యే యరపతినేని కొబ్బరికాయ కొట్టి శ్రీ సీతారామ వేణుగోపాల స్వామి వార్ల నూతన దేవాలయం (పునర్నిర్మాణం) నకు శంకుస్థాపన చెయ్యటం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### వృద్ధ దంపతుల భూమిని కబ్జా చేసిన

## మంత్రి, ఎమ్మెల్యే

**- చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చంద్రగిరి వైసీపీ ఇంచార్జ్**


**తిరుపతి(భారత శక్తి)** రాత్రి పట్టాలు రద్దు చేసి, పగలు మరో రిజిస్ట్రేషన్ చూపిస్తున్నారు. చంద్రగిరి ప్రజలు ఎప్పటికప్పుడు తమ పట్టాలు ఆన్లైన్ లో చెక్ చేసుకోవాలని చంద్రగిరి వైకాపా ఇంచార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. . ఓ వృద్ధ దంపతులు కొన్న భూమిని, కూటమికి చెందిన మంత్రి అనగాని, ఎమ్మెల్యే నాని కబ్జా చేశారు.. తిరుపతి రూరల్ తహశీల్దార్ జనార్దన్ రాజు ఓ టీడీపీ కార్యకర్త, అశోక్ రెడ్డికి రిజిస్ట్రేషన్ చేయించేలా డాక్యుమెంట్ సృష్టించారు.. ఎమ్మెల్యే నాని కోట్లలో అవినీతికి పాల్పడుతూ, వేలకోట్ల ఆస్తులు కాజేస్తున్నారు.. ధర్నాలు చేసే స్థాయికి బాధితులను తోసుకొచ్చారంటే చంద్రగిరిలో అక్రమాలు భారీగా జరుతున్నాయని అర్థం. మంత్రి అనగాని, ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రోత్సాహంతోనే కలెక్టర్ బదిలీ కాలేదు. ప్రభుత్వ భూములు మ్యుటేషన్ చేసి, ఎమ్మెల్యే నాని పట్టాలు చేయిస్తున్నారు.. చీఫ్ సెక్రటరీ స్థాయికి వెళ్లాల్సిన కలెక్టర్, ఇలాంటి తప్పులు చేసి భవిష్యత్ పాడు చేసుకోవద్దు. తుడా అప్రూవల్ రావాలంటే 2 నెలలు పడుతుంది... అలాంటిది అవిలాల భూమికి రెండు వారాల్లో ఎలా అప్రూవల్ వచ్చిందని అన్నారు.దీనికి బాధ్యుడు రూరల్ తహసీల్దార్ జనార్ధన్ రాజు. సంతకాలు పెట్టడానికే తహశీల్దార్ జనార్ధన్ రాజును ఇక్కడకు నాని తీసుకొచ్చారు. 2 ఏళ్ల తరువాత జనార్ధన్ రాజు జైలుకు వెళ్లడం ఖాయం. జనార్దన్ రాజుపై అన్ని రకాల విచారణలు చేయిస్తాం. ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రి ఎలా పట్టా చేయించారు...? అక్రమంగా పట్టాలు చేసుకున్న వాటిని రద్దు అయ్యేలా చేస్తామని అన్నారు.ఎమ్మెల్యే నాని మాటలు నమ్మి తమ ఆధార్ లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. రూ.100 కోట్ల భూమిని కొనుగోలు చేసే స్థాయిలో అశోక్ లేదు. అశోక్ ఎవరికీ బినామినో అందరికి తెలుసు. అది ప్రభుత్వ సభ?. ఆ సభకు వచ్చిన మహిళకు భోజనం కూడా పెట్టలేదు. ఆ సభను, మేము అసలు పట్టించుకోలేదు.. మాపై ఎన్ని కేసులు పెట్టిన వెనకడుగు వేయం. మేము, ఒక్క సెంటు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి చేయలేదని ప్రమాణం చేసేందుకు సిద్ధమని అన్నారు.రాత్రి పట్టా రద్దు చేసి, పగలు రిజిస్టర్ చేసుకొని సామర్థ్యం సామాన్యుడికి ఉందా.. త్వరలోనే అశోక్ వివరాలు ఆధారంతో వెల్లడిస్తాం.స్వర్ణ టవర్స్ లో భూ దందా కార్యాలయం ప్రారంభించారు. అక్కడ నుంచే భూములను ఎలా కొట్టేయాలో ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఆరోపించారు.

# బద్వేల్ టిడిపి ఇన్చార్జి ఇక లాంచనమే

**- డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డికి టిడిపి ఇన్చార్జి ఖాయం?**

**- ఇంచార్జ్ పదవి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దాదాపు నిర్ణయం**

**- బద్వేలు మాజీ మంత్రి దివంగత వీరారెడ్డి కుటుంబం నుంచి పగ్గాలు పోయినట్లే ?**



**బద్వేలు(భారత శక్తి)** బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా డీసీసీబీ చైర్మన్ మంజూరు సూర్యనారాయణ రెడ్డి ఇక లాంచనమే అని చెప్పాలి సూర్యనారాయణ రెడ్డికి బద్వేల్ టిడిపి పగ్గాలు ఇచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. గడచిన ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో బద్వేల్ అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఓడిపోవడం జరిగింది ఇప్పటి బద్వేలు టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పార్టీ సమన్వయకర్త విజయమ్మ కుమారుడు రితేష్ రెడ్డి నియోజకవర్గంలో పార్టీని నడిపించడంలో చాలావరకు విఫలమయ్యారని అధిష్టానం గుర్తించింది తాజాగా గత శనివారం జరిగిన ముఖ్యమంత్రి సమావేశానికి కడప జిల్లా నుండి అందరూ ఎమ్మెల్యేలు పార్టీ ఇన్చార్జిలు హాజరయ్యారు కానీ బద్వేల్ నుంచి విజయమ్మ రితేష్ రెడ్డిలు హాజరు కాలేదు కారణం వారికి పిలుపు లేకపోవడమే సమావేశం జరుగుతున్న విషయం కూడా వారికి తెలియలేదు విజయమ్మ ఆమె తండ్రి దివంగత మాజీ మంత్రి వీరారెడ్డి మృతి చెందిన తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించలేకపోయింది ఒకప్పుడు బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది వీరారెడ్డి మృతి చెందిన తర్వాత ఆ వైభవం లేకుండా పోయింది 2009 నుంచి బద్వేలు అసెంబ్లీ రిజర్వ్ అయింది రిజర్వ్ అయిన తర్వాత తాజాగా 2024 ఎన్నికల వరకు తెలుగుదేశం పార్టీ ఓడిపోతూనే వస్తుంది 2024ఎన్నికల్లో మాజీ ఇరిగేషన్ అధికారి రోశన్న బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు తెలుగుదేశం పార్టీ జనసేన బిజెపి ఆయనకు పూర్తి మద్దతు ఇచ్చిన ఫలితం లేకుండా పోయింది 2024 ఎన్నికల్లో కూటమి హవ రాష్ట్రమంతా వీచిన బద్వేల్ లో మాత్రం వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు కడప జిల్లాలో వైసిపి పాగా వేయకుండా చూడాలని ముఖ్యమంత్రి గట్టిగా నిర్ణయించారు అందులో భాగంగా బద్వేల్ లో టిడిపి ఇంచార్జ్ మార్పు కోసం ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు తెలిసింది బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం వేమలూరు గ్రామానికి చెందిన ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ ప్రస్తుత డీసీసీబీ చైర్మన్మంచూరు సూర్య నారాయణ రెడ్డి ని బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా నియమించేందుకు అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం శనివారం జరిగిన కడప జిల్లా పార్టీ ఎమ్మెల్యేల వద్ద బద్వేలు నియోజకవర్గ విషయంపై ప్రత్యేకంగా మాట్లాడినట్లు సమాచారం క ఇది ఇలా ఉండగా సూర్యనారాయణ రెడ్డికి డీసీసీబీ చైర్మన్ పదవి రావడంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు రితీష్ రెడ్డి ప్రమేయం ఏమాత్రం లేదని పార్టీలోని వారు చెపుతుంటారు ప్రస్తుతం పార్టీ సమన్వయకర్త రితీష్ రెడ్డి పార్టీ నడిపించడంలో విఫలమయ్యారని ఆరోపణలు ఉన్నాయి అంతేకాక వైసీపీలోని చాలామందితో ఆయనకు మంచి సంబంధం ఉన్నట్లు అధిష్టానానికి లెక్కలేనన్ని ఫిర్యాదులు అందాయి ఇది కూడా మైనస్ గా మారింది నియోజకవర్గంలోని గ్రూపులు కట్టడి చేయడంలో రితీష్ రెడ్డి విఫలమైనట్లు పార్టీ అధిష్టానం గుర్తించింది అందుకే శనివారం జరిగిన సమావేశానికి విజయమ్మ రెడ్డిలకు రాలేదు.సూర్యనారాయణరెడ్డి విజయమ్మ రితీష్ రెడ్డిలమధ్య గత ఏడు నెలలుగా తగాదాలు ఉన్నాయిరోజురోజుకు ఈ విభేదాలు మరింతగా పెరిగిపోయాయి ఈ నేపథ్యంలో టిడిపి ఇన్చార్జిగా సూర్యనారాయణ రెడ్డికి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానం దాదాపుగా ఒక నిర్ణయానికి వచ్చింది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి దివంగత మంత్రి వీరారెడ్డి పార్టీకి ఎంతో సేవలందించారు బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా చేశారు ఆయన చనిపోయిన తర్వాత ఆ వైభవం ఇప్పుడు లేకుండా పోయింది. బద్వేల్ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ వరుసగా ఓడిపోవడం పార్టీ అధిష్టానం చాలా సీరియస్ గా తీసుకుంది. అందులో భాగంగానే పార్టీ ఇన్చార్జి మార్చాలని నిర్ణయించారు. డీసీసీబీ చైర్మన్ మంజూరు సూర్యనారాయణ రెడ్డి కి ఇంచార్జ్ పగ్గాలు ఇచ్చేందుకు అధిష్టానం దాదాపుగా నిర్ణయించింది మృదు స్వభావి అందర్నీ కలుపుకు వెళ్లే సూర్యనారాయణ రెడ్డి అయితేనే బద్వేల్ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీకి న్యాయం జరుగుతుందని అధిష్టానం నిర్ణయించింది ఇంచార్జ్ పగ్గాలు చ చేపట్టేందుకు సూర్యనారాయణ రెడ్డి సుముఖంగా ఉన్నారు.

### ఏలూరు జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా రూపొందించేందుకు

# ప్రతీ ఒక్కరూ సహకరించాలి

**- మాదకద్రవ్యాల సమాచారం తెలిసిన వెంటనే నేషనల్ డెడికేషన్ హెల్ప్ లైను నెంబరు 14446, ఈగల్ టోల్ ఫ్రీ నెంబరు 1972 లకు తెలియజేస్తే తక్షణ చర్యలు**

**- యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి**

**- మాదకద్రవ్యాల సేవిస్తే భవిష్యత్తు అంధకారమాయమనే విషయంపై ప్రతీ పాఠశాల, కళాశాలల్లో అవగాహన కలిగించాలి**



**ఏలూరు, (భారత శక్తి) :** మాదకద్రవ్యాల జోలికి వెళితే భవిష్యత్తు అందకరమయమని, యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం మాదక ద్రవ్యాలు నిరోధక జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ పాల్గొన్నారు ...ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలుపై ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దు కునేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు జోలికి వెళ్ళితే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా మన జిల్లాను మార్చడానికి అందరి బాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. యువత మాదకద్రవ్యాలు జోలికి పోకుండా చూడవలసిన గురుతరమైన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాలతో పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవనని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు కలిగి ఉన్నా, వినియోగం, రవాణా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. ఉద్యోగాలకు, పాస్ పోర్ట్ ల జారీకి అనర్హతతో పాటు శాశ్వత క్రిమినల్ రికార్డు కలిగి ఉంటారని, భవిష్యత్తు మొత్తం అంధకారం అవుతుందన్నారు. ప్రతీ పాఠశాల, కళాశాలల్లోను మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేసే పోస్టర్ల ద్వారా మరియు క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రధానకూడళ్లలో ఫ్లెక్స్ లు ఏర్పాటుచేయాలని, ఆర్టీసీ బస్సులు, పాఠశాలలు, కళాశాలల్లో పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్ధాలపై, పోక్సో చట్టంపై పాఠశాల స్థాయిలో క్విజ్ వంటి పోటీలు నిర్వహించి మరింత అవగాహన పెంచాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు సేవిస్తున్నా, సరఫరా, రవాణాదారుల సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోనుచేసి సమాచారం అందించవచ్చన్నారు. ఇటువంటి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి డిఅడిక్షన్ సెంటర్ల ద్వారా చికిత్స అందించడం జరుగు తుందన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయించ కుండా ఔషధ దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. ట్రైన్లు, రవాణా వాహనాలు ద్వారా గంజాయి, డ్రగ్స్ రవాణాని నియంత్రించేందుకు గట్టి నిఘా పెట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ పిల్లలు డ్రగ్స్ మత్తుపదార్థాలు అలవాటు కాకుండా అధికార యంత్రాంగంతో పాటు తల్లితండ్రులు కూడా బాధ్యతలు తీసుకోవాలన్నారు. మన పిల్లల ప్రవర్తన ఎలా ఉంటుందని ఎప్పటి కప్పుడు పరిశీలించుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. మన పిల్లలు స్నేహాలు, నడవడిక, చదువు పట్ల శ్రద్ధ ఏలా ఉందని పరిశీలన చేసుకోవాలన్నారు. చెడు స్నేహాలు వల్ల పిల్లలు దొంగతనాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడతారని, పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. నేషనల్ డెడికేషన్ హెల్ప్ లైను నెంబరు 14446, ఈగల్ టోల్ ఫ్రీ నెంబరు 1972 సంప్రదించాలని, ఫోన్ చేసిన తక్షణం టీమ్లు క్షేత్రస్థాయిలోకి అడుగుపెట్టి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. తొలి దశలోనే జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను అతి సులువుగా తప్పించ వచ్చునని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ వై. ప్రసాదరావు, జిల్లా ఉప రవాణా కమిషనరు యస్.కె.కరీం, ఆర్అబి శాఖ యస్ఇ కె.విజయ రత్నం, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డా.యు.శోభ, జిల్లా ట్రాన్స్ పోర్టు అధికారి యస్.బి. శేఖరు, విభిన్న ప్రతిభా వంతులు శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, ఎన్టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డా. రాజీవ్ , జిల్లా ప్రజా రవాణాధికారి షబ్నమ్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జెడి వై.విశ్వమోహన్ రెడ్డి, డిఎస్పి డి.శ్రావణ్ కుమార్, ఈగిల్ టీమ్ ఇంచార్జి బి.ఉదయ భాస్కర్, డీసీపీఓ సూర్యచక్రవేణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అడవి పందుల మాంసం స్వాధీనం

**బెల్లంపల్లి:(భారత శక్తి)** బెల్లంపల్లి కన్నాల బస్తి రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద అడవి పందిని వేటాడి చంపిన కేసులో ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్ఓ పూర్ణచందర్ తెలిపారు. కన్నాలబస్తీకి చెందిన శ్రీరాముల సమ్మయ్య అనే వ్యక్తి అడవి పంది మాంసంతో పట్టుబడగా, అతన్ని విచారించగా శ్రీరాముల రమేష్, చిలుకూరి వెంకట్, సుల్తాన్ నవీన్, పల్లంకొండ రామ్ కలిసి వేటాడి చంపినట్టు ఎఫ్ఆర్ఓ వెల్లడించారు.



భారత శక్తి

శుక్రవారం, జూన్ 26, 2026

## కామారెడ్డిలో ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ రాజేష్ చంద్ర



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 25: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ , జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర , అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్.వి. గిరి తో కలిసి పట్టణంలోని కీసాన్ అగ్రి మార్ట్ ఎరువుల దుకాణాన్ని, గోదాం ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న యూరియా, ఇతర ఎరువుల నిల్వలను పరిశీలించి, మిగిలిన స్టాక్ వివరాలను వెంటనే సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని డీలర్‌కు ఆదేశించారు. ఎరువుల విక్రయాలు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించడంతో పాటు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి యూరియా లభ్యత, బుకింగ్ యాప్ వినియోగంపై ఆరా తీశారు. యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ చేసుకోవడం వల్ల పారదర్శకత పెరుగుతుందని, రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందని తెలిపారు. ఎరువుల నిల్వలు, సరఫరా, విక్రయాల పై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎలాంటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 25 (భారత శక్తి ) జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బైంసా మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాలను సందర్శించి వాటి ప్రస్తుత స్థితిగతులను పరిశీలించారు. ఈ వారాంతంలో జరగనున్న మంత్రి పర్యటన సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడాలని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు బైంసా మున్సిపాలిటీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని పూర్తి స్థాయిలో సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దత్తాద్రి, మున్సిపల్ కమిషనర్ సిద్ధిఖా కుతిజా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సాయి కృష్ణ మరణం మిస్టరీగా మారిందా..?

- లోతైన దర్యాప్తు కోరిన మేడా శ్రీనివాస్
- లాకప్ డెత్ కేసులో రాజకీయ కోణమా..?
- నాగరాజు రిస్క్ వెనుక ఎవరి భరోసా..?
- సాయి కృష్ణ కేసులో ఇంకా ఎన్నో ప్రశ్నలు.. నిజాలు వెలుగులోకి వస్తాయా?
- లాకప్ డెత్ కేసు వెనుక పెద్ద కుట్ర ఉందా..?
- సాయి కృష్ణ లాకప్ డెత్ కేసుపై మేడా శ్రీనివాస్ పలు ప్రశ్నలు



విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25: కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో జరిగిన సాయి కృష్ణ లాకప్ డెత్ ఘటనపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరగాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు, న్యాయవాది మేడా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో పలు సందేహాలు, ప్రశ్నలను లేవనెత్తారు. సాయి కృష్ణపై గతంలో నేరారోపణలు ఉన్నప్పటికీ, అతను పోలీస్ కస్టడీలో మృతి చెందడం అత్యంత తీవ్రమైన అంశమని పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజు అంతటి రిస్క్ తీసుకోవడానికి గల కారణాలు ఏమిటో దర్యాప్తులో వెలుగులోకి రావాలని అన్నారు. సాయి కృష్ణను హత్య చేయాలని లేదా లాకప్ డెత్ చేయాలని ఎవరైనా ప్రభావశీల వ్యక్తులు, రాజకీయ నాయకులు లేదా ఇతరులు ప్రేరేపించారా అనే కోణంలో కూడా విచారణ జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే ఈ ఘటన వెనుక మరికొందరి పాత్ర ఉందా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాలని కోరారు. సీఐ నాగరాజు అరెస్టు సందర్భంగా నిర్వహించిన ఆందోళనల వెనుక ఉన్న వ్యక్తులు, సంస్థలు, రాజకీయ అనుబంధాలపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు. మృతుడు సాయి కృష్ణ కుటుంబ సభ్యుల ప్రకటనల్లో వచ్చిన మార్పులు కూడా అనేక సందేహాలకు తావిస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్ ) సమగ్రంగా విచారించి, సాంకేతిక ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి నిజానిజాలు వెలికితీయాలని మేడా శ్రీనివాస్ కోరారు. అవసరమైతే ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. కృష్ణలంక లాకప్ డెత్ కేసులో పూర్తి స్థాయి, పారదర్శక దర్యాప్తు జరిగితే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. న్యాయం జరిగేలా సంబంధిత దర్యాప్తు సంస్థలు ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఆపదలో అండగా ఎమ్మెల్యే మదన్ మోహన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 25: ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తోడుగా నిలుస్తూ, ఆపదలో ఉన్న వారికి ధైర్యం చెప్పడం తన బాధ్యతగా భావిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే శ్రీ మదన్ మోహన్ పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. లింగంపేట మండలం పరమల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సాయికుమార్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరమల్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నర్సింహులు భార్య, కుమార్తె ప్రమాదవశాత్తు మృతి చెందిన విషాద ఘటన పట్ల ఎమ్మెల్యే ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి ఇంటికి వెళ్లి నర్సింహులుని పరామర్శించి, కుటుంబానికి ధైర్యం చెప్పి తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు. నాగిరెడ్డిపేట మండలం మల్తుమేధ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ అజ్జేమ్ ప్రమాదవశాత్తు మృతి చెందిన సందర్భంగా, ఎమ్మెల్యే మదన్ మోహన్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం నూరిపోస్తూ, పార్టీ, తన తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. "బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ, నేను ఎల్లప్పుడూ తోడుగా ఉంటాం" అని ఎమ్మెల్యే తెలిపారు.

## రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 25: కామారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో యూరియా నిల్వలు, పంపిణీ విధానం, రైతుల అవసరాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.

**అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ,**

కామారెడ్డి జిల్లా రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, జిల్లాలో యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. గత సంవత్సరం జూలై నెల వరకు కామారెడ్డి నియోజకవర్గానికి మొత్తం 106 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్లు గుర్తు చేసిన షబ్బీర్ అలీ, ఈ సంవత్సరం జూన్ 20వ తేదీ నాటికే 140 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించినట్లు వెల్లడించారు.

**ఇది గత సంవత్సరంతో పోలిస్తే గణనీయమైన పెరుగుదల అని పేర్కొన్నారు.**

అదనంగా రాబోయే రోజుల్లో మరింత యూరియా నిల్వలను జిల్లాకు తరలిస్తున్నామని, రేపు సాయంత్రం వరకు కూడా కొత్త స్టాక్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నిరంతర సరఫరా కొనసాగుతుందని చెప్పారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం యూరియా కొరత ఉందంటూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులు అలాంటి ప్రచారాలను నమ్మకుండా అధికారులతో, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. రైతులకు తగినంత యూరియా అందించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతుల అవసరాలపై ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తంగా ఉందని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్న ఆయన, రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా తమ వ్యవసాయ పనులను కొనసాగించాలని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బైంసా మున్సిపాలిటీ పరిధిలో జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే రామారావు పటేల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 25 (భారత శక్తి)ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దత్తద్రి, మున్సిపల్ కమిషనర్ సిద్ధికి కుతిజా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విజయవాడ పోస్టల్ రీజియన్ లో జూన్ 30న తపాలా అదాలత్

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జూన్ 25: విజయవాడ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా సేవలకు సంబంధించి వినియోగదారుల యొక్క ఫిర్యాదులు మరియు (మస్యలు పరిష్కరించు నిమిత్తం తేది: 30/06/2026 11:00ం శివరామ్ (గ్రూ౦), పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ రీజియన్, విజయవాడ వారిచే తపాలా అదాలత్ నిర్వహించబడును. తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులు మరియు సమస్యలు ఈ ఆదాలత్ నందు పరిష్కరించబడును. తపాలా వినియోగదారులు తమ సమస్యలు మరియు ఫిర్యాదులు తేది: 29/06/2026 లోగా 'తపాలా అదాలత్' శీర్షికతో అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్, పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, గాంధీనగర్, విజయవాడ 520003 అను చిరునామాకు పంపవలసినదిగా కోరడమైనది. ఫిర్యాదు దారులు వ్యక్తిగతంగా కూడా హాజరు కావొచ్చునని పోస్ట్ మాస్టర్ జనరల్ వారు తెలిపారు.

## గంజాయి సరఫరా, వినియోగ నిర్మూలనే లక్ష్యంగా నార్కోటిక్ జాగిలాలతో విస్తృత తనిఖీలు.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 25: యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలో నార్కోటిక్ డాగ్ సహాయంతో కిరాణా దుకాణాలు, పాన్ షాప్‌లు, బస్టాండ్ , విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు, బస్టాండ్‌లు వంటి ప్రజా రద్దీ ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలాల సహాయంతో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, వాటి దుష్పరిణామాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111 కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయండి. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

- సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్

-యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో అవగాహన ర్యాలీ, నాటికలు, పోస్టర్ పెయింటింగ్‌లతో చైతన్యం.



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 25: యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ఆదేశాల మేరకు శాంతినగర్ నుండి గాంధీ చౌరస్తా వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌరస్తా వద్ద విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరిస్తూ నాటికలు ప్రదర్శించారు. అలాగే పోస్టర్ పెయింటింగ్ కార్యక్రమంలో పాల్గొని, హ్యూమన్ చైన్ ఏర్పాటు చేసి యాంటీ-డ్రగ్ ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ..మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్పరిణామాలపై విద్యార్థులకు , ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలకు సంబంధించిన చట్టపరమైన శిక్షలను వివరించారు. చెడు స్నేహితుల ప్రభావం, సామాజిక ఒత్తిళ్లు యువతను డ్రగ్స్ వైపు మళ్లించే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం విద్య, భవిష్యత్ కెరీర్, కుటుంబం మరియు సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111 కు లేదా సమీప పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

## మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కుమారుడు ప్రణయ్ వివాహ వేడుకకు హాజరైన పల్లా రాజేశ్వర్ రెడ్డి



జనగామ(భారత శక్తి)జూన్ 25: హైదరాబాద్ నగరంలోని జాన్వీడా ప్రాంతంలో ఉన్న కే కన్వెన్షన్ లో గురువారం జరిగిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కుమారుడు ప్రణయ్ వివాహ వేడుకలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆయన ఆకాంక్షించారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy